TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 90 | హైదరాబాద్ | శనివారం 19-09-2026 | పేజీలు: 08

# టెండర్.. గోల్ మాల్ !



- రూ.300కోట్ల నష్టం జరిగిందని ఆరోపణలు
- హెచ్ఆర్డీసీఎల్ లో భారీగా అవకతవకలు
- విచారణ జరిపించాలి : సీఎంకు ఎఫ్ఎఫ్జీ లేఖ

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

హైదరాబాద్ రోడ్డు డవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్ఎంఆర్డీసీఎల్) టెండర్లలో భారీగా అవకతకవలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బడా సంస్థల కోసం టెండర్ రూల్స్ మార్చారని పలువురు చిన్న

మిగతా 2లో..



## మమత వర్గానికి షాక్..

- నందిగ్రామ్‌లో అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ
- నందిగ్రామ్ ఉప ఎన్నిక బరి నుంచి సంచితా ప్రధాన్ తప్పుకొన్న వైనం
- నామినేషన్‌ను ఉపసంహరించుకున్న మమత వర్గం అభ్యర్థి
- సువేందు అధికారితో భేటీ అనంతరం కీలక పరిణామం
- అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికలు
- మమత వర్గానికి కొత్త పేరు, గుర్తు కేటాయించిన ఈసీ

3

## సిద్ధిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం
- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ



2

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి

- కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి
- 2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య



2



2

## దానం నాగేందర్ రాజీనామా చేయాలి..

- హైకోర్టు తీర్పు నేపథ్యంలో భాజపా డిమాండ్
- సుప్రీంకోర్టుకు వెళ్లకుండా రాజీనామా చేయాలని సూచన
- సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు
- హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్న మహేశ్వర్‌రెడ్డి
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడతామని వెల్లడి
- ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునేవారికి తీర్పు చెంపపెట్టని వ్యాఖ్య
- కాంగ్రెస్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు
- మిగిలిన ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించాలని డిమాండ్
- ఆరు నెలల్లో తీర్పు రావడం ఇదే తొలిసారన్న మాజీ ఎమ్మెల్యే



## దానం నాగేందర్‌పై అనర్హత వేటు..

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన సీజే ధర్మాసనం
- దానం నాగేందర్‌పై అనర్హత వేటు
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం
- 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ
- పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ స్పీకర్‌కు ఫిర్యాదు
- దానంపై అనర్హత పిటిషన్లను తిరస్కరించిన స్పీకర్
- మార్చి 11న స్పీకర్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టులో సవాల్
- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా ప్రకటించాలని స్పీకర్, ఈసీకి ఆదేశాలు

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సీజే ధర్మాసనం తప్పుబట్టింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఎన్నికల సంఘానికి హైకోర్టు సమాచారం ఇచ్చింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా విజయం

మిగతా 2 లో..

## కేంద్రసాయం కావాలి

- ఎల్ నినోతో ఎంతో దెబ్బతిన్నాం
- కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్రంలో వర్షా భావ పరిస్థితులపై కేంద్రానికి వివరించిన సీఎం
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో రేవంత్ భేటీ
- అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి
- వ్యవసాయ రంగంలో పెరిగిన విద్యుత్ వినియోగం
- తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- పంటల మార్పిడికి సహకరించాలని కేంద్రానికి వినతి
- 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ ఏర్పాటు
- పీఎంఏవైజీలో మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి
- సన్నబియ్యం, సన్నవడ్లకు బోనస్ అంశాలను వివరించిన సీఎం




హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సీఎం కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితర ఉన్నతాధికారులతో కలిసి కేంద్రానికి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని

మిగతా 2లో..



2

## భారతీయుల డీఎన్ఏలోనే ధర్మం..

- భారతీయుల డీఎన్ఏలోనే ధర్మం ఉందన్న ఆర్ఎస్ఎస్ చీఫ్
- ధర్మం మన చర్యలకు దిశానిర్దేశం చేస్తుందని వ్యాఖ్య
- ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యంపై హర్షం
- జెన్‌జీ భజనలపై ఆసక్తి చూపడం సంతోషకరమని వెల్లడి
- మతం, ధర్మం వృద్ధులకు మాత్రమే సంబంధించినవి కావని స్పష్టం
- పదవీవిరమణతర్వాతేధర్మాన్ని పాటించాలనేభావనసరికాదనివ్యాఖ్య

## నా జీవితం తెరిచిన పుస్తకం

- నా భూములు చూసేందుకు కాంగ్రెస్ నేతలు వస్తున్నారన్న హరీశ్‌రావు
- మూడు జిల్లాల నుంచి 3 వేల మంది పోలీసులను ఎందుకు రప్పించారు?
- ముందే చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- కాంగ్రెస్ నేతలకు అన్నం పెట్టి తోట చూపించేవాడినని వెల్లడి
- సిద్దిపేట ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి చిరునామా
- తన భూమిని ఉన్నది ఉన్నట్లు చూపించాలని సూచన
- అవాస్తవాలు చెప్పొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు
- తాను కబ్జాలు చేయలేదన్న హరీశ్‌రావు
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో వెల్లడించానని స్పష్టం
- తన ఆస్తులు, పనితీరును చూసే ప్రజలు ఏడుసార్లు గెలిపించారని వ్యాఖ్య



02

## గంజాయి నిర్మూలనకు ఈగల్ టీమ్స్ పటిష్ఠ నిఘా

- '2026-2029 మాదక ద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్'పై సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీమ్‌స్‌తో హోంమంత్రి అనిత సమావేశం
- గంజాయి నిర్మూలనలో పురోగతిపై అధికారుల వివరణ
- ఏపీవ్యాప్తంగా 900 గంజాయి హాట్‌స్పాట్ల గుర్తింపు
- జియో ట్యాగింగ్ నిఘాతో ప్రత్యేక చర్యలు
- నాలుగు నెలల్లో 20 వేలకు పైగా కేసుల నమోదు
- ఈగల్ నిఘాతో క్రైమ్ రేట్ 14 శాతం తగ్గిందన్న హోంమంత్రి
- గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం కోసం 1972 టోల్‌ఫ్రీ
- 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
- భావితరాల భవిష్యత్తు కోసమే ఈగల్ టీమ్ ఏర్పాటు చేశామని వెల్లడి




హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

'2026-2029 మాదక ద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్' అమలుపై హోంమంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. ఈగల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఈగల్ టీమ్‌స్‌తో

మిగతా 2 లో..

## టీజీఎస్ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు.. షెడ్యూల్ విడుదల

- ఎనిమిదేళ్ల తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్
- ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- అక్టోబరు 9న పోలింగ్
- అక్టోబరు 17న ఫలితాల వెల్లడి
- 2016 జులై 19న చివరిసారిగా ఎన్నికలు
- 2018లో జరగాల్సిన ఎన్నికలు వాయిదా
- ఎన్నికల్లో గెలిచిన సంఘానికే గుర్తింపు
- రీజియన్, రాష్ట్రస్థాయిలో వేర్వేరు ఎన్నికలు
- కార్మిక సమస్యలపై చర్చించే చట్టబద్ధమైన హక్కు
- అధికారి స్థాయి మినహా ఉద్యోగులందరికీ ఓటు హక్కు




హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ఆర్టీసీ)లో ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఎన్నికలు నిర్వహించి.. అదే నెల 17న ఫలితాలను వెల్లడించనున్నట్లు అధికారులు

మిగతా 2 లో..

## జన్వాడ ఫామ్‌హౌస్ నాది.. కేటీఆర్‌కు సంబంధం లేదు

- జన్వాడ ఫామ్‌హౌస్ తనదేనని స్పష్టం చేసిన యజమాని ప్రదీప్ రెడ్డి
- కేటీఆర్‌కు కేవలం లీజుకు మాత్రమే ఇచ్చానని వెల్లడి
- ఫామ్‌హౌస్ కు సంబంధించి ఎలాంటి భూ వివాదాలు లేవని స్పష్టీకరణ
- రాజకీయ పార్టీల నేతలు తనిఖీకి రావడం సరికాదని వ్యాఖ్య
- చట్టప్రకారం ఏ విచారణకైనా సహకరిస్తానని హామీ



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన జన్వాడ ఫామ్‌హౌస్ వివాదంపై దాని యజమాని ప్రదీప్ రెడ్డి స్పందించారు. ఆ ఫామ్‌హౌస్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలాంటి సంబంధం లేదని, అది తన వ్యక్తిగత ఆస్తి అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నేతలు ఫామ్‌హౌస్‌ను సందర్శించాలని యోచిస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, "జన్వాడలోని ఫామ్‌హౌస్ భూమి నాది. కేటీఆర్, నేను

మిగతా 2లో..

# కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి

- **కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి**
- **2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న**
- **తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.
మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టి నాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

# సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

- **కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం**
- **భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్**
- **కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య**
- **కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు.
కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

# దానం నాగేందర్ రాజీనామా చేయాలి..

- **బీజేపీ స్టేట్ చీఫ్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**
- **హైకోర్టు తీర్పు నేపథ్యంలో భాజపా డిమాండ్**
- **సుప్రీంకోర్టుకు వెళ్లకుండా రాజీనామా చేయాలని సూచన**
- **సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు**
- **హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్న మహేశ్వర్‌రెడ్డి**
- **ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడతామని వెల్లడి**
- **ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునేవారికి తీర్పు చెంపపెట్టని వ్యాఖ్య**
- **కాంగ్రెస్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు**
- **మిగిలిన ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించాలని డిమాండ్**
- **ప్రజాస్వామ్య విజయం: చింతల రామచంద్రారెడ్డి**
- **ఆరు నెలల్లో తీర్పు రావడం ఇదే తొలిసారన్న మాజీ ఎమ్మెల్యే**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హైకోర్టు తీర్పు నేపథ్యంలో సుప్రీంకోర్టుకు వెళ్లకుండా తన పదవికి రాజీనామా చేయాలని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు.
దానం నాగేందర్ ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్న నేపథ్యంలో.. తాము రేపు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేస్తామని మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.
ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భాజపా పోరాడుతుందని ఆయన అన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే వారికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు.
ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన మిగిలిన ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**ప్రజాస్వామ్య విజయం: చింతల**

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ తీర్పును ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు.
కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్‌కు హైకోర్టు తీర్పు చెంపపెట్టు వంటిదని చింతల వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని పరిరక్షించే తీర్పుగా దీనిని భావిస్తున్నట్లు తెలిపారు.
ఆరు నెలల్లో తీర్పు రావడం ఇదే మొదటిసారని చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ తీర్పును అందరి విజయంగా భావిస్తున్నామని అన్నారు.



# కేంద్రసాయం కావాలి

**మొదటిపేజీ తరువాయి**

సీఎం తెలిపారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు.
ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పంటల మార్పిడిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఇందుకు రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు.
ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు.
ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ (PMAYG) పథకంలో భాగంగా తొలి విడతగా తెలంగాణకు 2 లక్షల ఇళ్లను కేటాయించినందుకు కేంద్ర మంత్రికి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 11,56,915 మంది అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని గత జూలైలో ఢిల్లీలో కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.
రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కూడా కేటాయించాలని ఈ సందర్భంగా శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సీఎం



కోరారు.
దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి వివరించారు. సన్నవడ్ల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.

# నా జీవితం తెరిచిన పుస్తకం

- **నా భూములు చూసేందుకు కాంగ్రెస్ నేతలు వస్తున్నారన్న హరీశ్‌రావు**
- **మూడు జిల్లాల నుంచి 3 వేల మంది పోలీసులను ఎందుకు రప్పించారు?**
- **ముందే చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య**
- **కాంగ్రెస్ నేతలకు అన్నం పెట్టి తోట చూపించేవాడినని వెల్లడి**
- **సిద్దిపేట ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి చిరునామా**
- **తన భూమిని ఉన్నది ఉన్నట్లు చూపించాలని సూచన**
- **అవాస్తవాలు చెప్పొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు**
- **తాను కబ్జాలు చేయలేదన్న హరీశ్‌రావు**
- **తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో వెల్లడించానని స్పష్టం**
- **తన ఆస్తులు, పనితీరును చూసే ప్రజలు ఏడుసార్లు గెలిపించారని వ్యాఖ్య**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** తన జీవితం తెరిచిన పుస్తకమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతల పర్యటనపై ఆయన స్పందించారు. సిద్దిపేటకు కాంగ్రెస్ నేతలు వస్తున్నారని, తన భూములు చూసేందుకు వస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. ఇందుకోసం మూడు జిల్లాల నుంచి సుమారు 3 వేల మంది పోలీసులను రప్పించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు వస్తున్నారని ముందే తనకు చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్యానించారు. వారికి అన్నం పెట్టి తన తోటను కూడా చూపించేవాడినని అన్నారు. కాంగ్రెస్ నేతలు అంతగా భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.
సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి చిరునామా అని హరీశ్‌రావు అన్నారు. అంతమంది పోలీసులను పెట్టుకుని రావాల్సిన అవసరం లేదని చెప్పారు. తన భూమిని చూసి ఉన్నది ఉన్నట్లు ప్రజలకు చెప్పాలని సూచించారు. అవాస్తవాలు చెప్పొద్దని అన్నారు.
తాను కబ్జాలు చేయలేదని, ప్రజల సొమ్ము దోచుకోలేదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తన ఆస్తులన్నింటినీ అఫిడవిట్‌లో వెల్లడించానని తెలిపారు.
తన ఆస్తులు, పనితీరును చూసే ప్రజలు తనను ఏడుసార్లు గెలిపించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. తనపై ఎలాంటి ఆరోపణలు చేసినా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని అన్నారు.

# గంజాయి నిర్మూలనకు ఈగల్ టీమ్స్ పటిష్ఠ నిఘా

**మొదటిపేజీ తరువాయి**

జూమ్ కాల్ ద్వారా మాట్లాడారు. గంజాయి నిర్మూలనలో ఇప్పటివరకు సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ఈగల్ ఐజీ ఆకే రవి కృష్ణ హోంమంత్రికి వివరించారు.
ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. భావితరాల బంగారు భవిష్యత్తు కోసమే సీఎం చంద్రబాబు ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారాన్ని అందించేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో 1972 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీవ్యాప్తంగా 900 గంజాయి హాట్‌స్పాట్లను గుర్తించి జియో ట్యాగింగ్ నిఘా కొనసాగిస్తున్నట్లు హోంమంత్రి వెల్లడించారు. గత నాలుగు నెలల్లోనే 20 వేలకు పైగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈగల్ టీమ్స్ పటిష్ఠ నిఘాతో రాష్ట్రంలో క్రైమ్ రేట్ 14 శాతం తగ్గిందని అనిత పేర్కొన్నారు. గంజాయి నియంత్రణకు మరింత సమర్థంగా పనిచేసేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



# టెండర్.. గోల్ మాల్ !

కాంట్రాక్టర్లు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఈ టెండర్లలో సుమారు రూ.300కోట్ల నష్టం జరిగిందని సమాచారం.

**2017లో హెచ్‌ఆర్డీసీఎల్..**

హైదరాబాద్ నగర పరిధిలో రహదారుల నిర్మాణం, నిర్వహణకు జీహెచ్ఎంసీతో పాటు రోడ్లు, భవనాల శాఖ ఇప్పటికే బాధ్యతలు నిర్వహిస్తున్నాయి. జీహెచ్ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 373 ప్రకారం నగర పరిధిలోని ప్రజా రహదారులు కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. హైదరాబాద్ పరిధిలో ఆర్అండ్‌బీ శాఖకు సుమారు 600 కిలోమీటర్ల రహదారుల నెట్‌వర్క్ ఉంది. ఇప్పటికే రెండు ప్రభుత్వ సంస్థలు రహదారుల నిర్వహణను చేపడుతున్నప్పటికీ, హైదరాబాద్‌లో రహదారుల నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం 2017లో హెచ్‌ఆర్డీసీఎల్‌ను ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్పీవీ)గా ఏర్పాటు చేసింది.

**రూ.5 వేల కోట్ల రుణాలు..**

హెచ్‌ఆర్డీసీఎల్ ద్వారా ఆయా ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి రహదారి పనులు చేపడుతోంది. అయితే సంస్థ ఆర్థిక, పరిపాలనా కార్యకలాపాలపై తగినంత పారదర్శకత లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంస్థ పొందిన రుణాలు, చేసిన ఖర్చులు, చేపట్టిన పనుల వివరాలు రాష్ట్ర బడ్జెట్‌లో స్పష్టంగా ప్రతిబింబించడంలేదు. 2017లో సంస్థ ఏర్పడినప్పటి నుంచి సుమారు రూ. 5వేల కోట్ల మేర రుణాలు పొందింది. అయితే జీహెచ్ఎంసీ పరిధిలో చేపట్టాల్సిన కొన్ని పనులను హెచ్‌ఆర్డీసీఎల్ నిర్వహిస్తోంది. గత ఎనిమిదేళ్లలో సంస్థ చేసిన ఖర్చులపై కాగ్ ద్వారా ఆడిట్ కూడా జరగలేదనే విమర్శలూ లేకపోలేదు.

**టెండర్ల రద్దుపై..**

హెచ్‌ఆర్డీసీఎల్ ఆధ్వర్యంలో 2025లో రూ.1,500 కోట్ల రుణం తీసుకుని మూడు దశల్లో పనులు చేపట్టింది. మొదటి దశలో పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు అంచనాల విలువ కంటే దాదాపు 7 శాతం తక్కువగా టెండర్ బిడ్ దాఖలు చేశారు. రెండో దశలో రూ.2 కోట్ల నుంచి రూ.42 కోట్ల వరకు అంచనా విలువ కలిగిన 13 పనులకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో పలువురు చిన్న కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. పోటీ కారణంగా టెండర్ ధరలు అంచనా విలువ కంటే 4 శాతం నుంచి 18 శాతం వరకు తక్కువగా దాఖలు చేశారు. అయితే ఈ టెండర్లను రద్దు చేసి, 13 పనులను పెద్ద ప్యాకేజీలుగా కలిపి, టెండర్ నిబంధనలను మార్చి తిరిగి రెండోసారి టెండర్లు పిలిచారు. అయితే బడా సంస్థల కోసం టెండర్ నిబంధనల్లో మార్పులు చేశారనే విమర్శలున్నాయి. ఫలితంగా చిన్న కాంట్రాక్టర్లకు అవకాశం లేకుండ పోయిందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# జన్వాడ ఫామ్‌హౌస్ నాది.. కేటీఆర్‌కు సంబంధం లేదు

**మొదటిపేజీ తరువాయి**

చిన్ననాటి స్నేహితులం. ఆ ఫామ్‌హౌస్‌ను కేటీఆర్‌కు లీజుకు ఇచ్చాను. అంతకుమించి దీనితో ఆయనకు ఎటువంటి సంబంధం లేదు" అని తెలిపారు. ఆ భూమికి సంబంధించి ఎటువంటి వివాదాలు లేవని, అన్ని పత్రాలు చట్టబద్ధంగా, సక్రమంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.
ప్రభుత్వానికి గానీ, సంబంధిత అధికారులకు గానీ ఏవైనా అనుమానాలు ఉంటే, తనకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని ప్రదీప్ రెడ్డి సూచించారు. చట్టపరమైన ప్రక్రియ ద్వారా అవసరమైన అన్ని పత్రాలను సమర్పించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే, ప్రైవేట్ ఆస్తి వద్దకు రాజకీయ నేతలు వచ్చి తనిఖీలు చేయడం, దీనిని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టప్రకారం జరిగే ఎటువంటి విచారణకైనా తాను పూర్తిగా సహకరిస్తానని ప్రదీప్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

**మొదటిపేజీ తరువాయి**

సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది.
ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ విచారణ చేపట్టారు. దానం నాగేందర్ చట్టపరంగా పార్టీ ఫిరాయించినట్లు నిరూపించే తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ గత మార్చి 11న నిర్ణయం వెలువరించారు.
స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్‌లో చేరారని, అనంతరం కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారని వారు పిటిషన్లలో పేర్కొన్నారు.
పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్‌కు అనేక ఆధారాలు సమర్పించినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.
ఈ పిటిషన్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన సీజే ధర్మాసనం శుక్రవారం తుది తీర్పు వెలువరించింది. కాంగ్రెస్ పార్టీ తరఫున లోక్‌సభ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ చేసిన నాటి నుంచే ఆయనపై అనర్హత వేటు వర్తిస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఎన్నికల సంఘానికి తెలియజేసింది.

# భారతీయుల డీఎన్ఏలోనే ధర్మం..

- **భారతీయుల డీఎన్ఏలోనే ధర్మం ఉందన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్**
- **ధర్మం మన చర్యలకు దిశానిర్దేశం చేస్తుందని వ్యాఖ్య**
- **ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యంపై హర్షం**
- **జెన్‌జీ భజనలపై ఆసక్తి చూపడం సంతోషకరమని వెల్లడి**
- **మతం, ధర్మం వృద్ధులకు మాత్రమే సంబంధించినవి కావని స్పష్టం**
- **పదవీ విరమణ తర్వాతే ధర్మాన్ని పాటించాలనే భావన సరికాదని వ్యాఖ్య**
- **గీత, రామాయణం అన్ని వయసుల వారు చదవాలని సూచన**
- **ఆధ్యాత్మిక వారసత్వాన్ని భారత్ కొనసాగించాలని పిలుపు**
- **విశ్వగురువుగా ఎదగాలంటే సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచన**
- **ప్రకృతి, వన్యప్రాణుల పరిరక్షణ కూడా మన బాధ్యతేనన్న భాగవత్**

**నేషనల్ బ్యూరో, (ప్రజాక్షేత్రం):** భారతీయుల డీఎన్ఏలోనే ధర్మం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ అన్నారు. ధర్మం భారతీయుల చర్యలకు దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఉజ్జయినిలో నిర్వహించిన యువ ధర్మ సంసద్‌లో ఆయన మాట్లాడారు.
ప్రస్తుతం యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటుండటంపై మోహన్ భాగవత్ సంతోషం వ్యక్తం చేశారు. జెన్‌జీ యువత ధర్మం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలపై ఆసక్తి చూపిస్తుండటం సంతోషకరమైన విషయమని అన్నారు.
మతం, ధర్మం అనేవి కేవలం వృద్ధులకు సంబంధించిన అంశాలని కొందరు భావిస్తున్నారని భాగవత్ పేర్కొన్నారు. గీత, రామాయణం వంటి పుస్తకాలను పదవీ విరమణ తర్వాత చదవాల్సినవిగా భావించడం సరికాదన్నారు. ధర్మం, మతం అన్ని వయసుల వారు పాటించాల్సిన జీవన విధానాలని వివరించారు.
ధర్మం భారతీయుల డీఎన్ఏలోనే ఉండి.. మన చర్యలకు దిశానిర్దేశం చేస్తుందనడానికి యువత ఆధ్యాత్మికతపై చూపిస్తున్న ఆసక్తే ఉదాహరణ అని భాగవత్ అన్నారు.
భారత్ విశ్వగురువుగా ఎదగాలంటే పూర్వీకుల నుంచి పొందిన ఆధ్యాత్మిక వారసత్వాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు. ప్రకృతిని, వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని మోహన్ భాగవత్ పేర్కొన్నారు.

# టీజీఎస్ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు.. షెడ్యూల్ విడుదల

**మొదటిపేజీ తరువాయి**

తెలిపారు.
ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ.. ఎన్నికల్లో గెలిచిన సంఘాలనే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండు స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు.
కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు గుర్తింపు సంఘానికే ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు చేసుకోవడంలోనూ ఈ సంఘం కీలకంగా వ్యవహరిస్తుంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి ఉద్యోగులు మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది. గుర్తింపు సంఘం ఎన్నికలు చివరిసారిగా 2016 జులై 19న నిర్వహించారు. అనంతరం




2018లో ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని నిర్వహించలేదు. తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆర్టీసీ కార్మిక సంఘాల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది.

19.09.2026
శనివారం | హైదరాబాద్
ప్రజాక్షేత్రం
ప్రతి క్షణం.. ప్రజల పక్షం

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- **స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ పాఠశాల**
- **తడి పొడి చెత్త గురించి విద్యార్థులకు వివరించిన మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ**

**నంద్యాల,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం)**

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ పాఠశాల అనే కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణంలోని జి పుల్లారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో పాఠశాల డైరెక్టర్ సాయి ప్రణీత్,హెడ్మాస్టర్ చాంద్ భాష అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ హాజరయ్యారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ సాయి ప్రణీత్, హెడ్మాస్టర్ చాంద్ భాషలు మున్సిపల్ కమిషనర్ బేబీని దృశ్యాలువా తో సన్మానించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ తడి చెత్త,పొడి చెత్త వేరు వేరు చేసుకోవాలని, మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మనం తినే పదార్థాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని,సీజనల్ లో వ్యాధులు ప్రబలకుండా ఉండాలి అంటే పలు జాగ్రత్తలు తీసుకోవాలని,ప్లాస్టిక్ కవర్ల వాడకం,పేపర్ కప్పులు పేపర్ ప్లేట్లు వాడకం తగ్గించాలని, వీటివల్ల అనేకమైన దీర్ఘకాలిక రోగాలు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఏఈ ఓబులేసు, మేనేజర్ ఆర్ మోహన్ నాయక్, వార్డు శానిటేషన్,ఎన్విరాన్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మమత వర్గానికి షాక్..

- **నందిగ్రామ్‌లో అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ**
- **నందిగ్రామ్ ఉప ఎన్నిక బరి నుంచి సంచితా ప్రధాన్ తప్పుకొన్న వైనం**
- **నామినేషన్‌ను ఉపసంహరించుకున్న మమత వర్గం అభ్యర్థి**
- **సువేందు అధికారితో భేటీ అనంతరం కీలక పరిణామం**
- **అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికలు**
- **మమత వర్గానికి కొత్త పేరు, గుర్తు కేటాయించిన ఈసీ**
- **నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తామన్న మమత**
- **భాజపాపై కుట్ర ఆరోపణలు చేసిన మాజీ సీఎం**
- **ప్రజాస్వామ్యానికి చీకటి రోజంటూ మమత వ్యాఖ్యలు**
- **కాంగ్రెస్ అభ్యర్థి మిలాన్ ప్రధాన్ అరెస్ట్**
- **2007 భూసేకరణ వ్యతిరేక ఉద్యమం కేసులో అరెస్ట్ చేసినట్లు కాంగ్రెస్ వెల్లడి**

**నేషనల్ బ్యూరో, (ప్రజాక్షేత్రం):**





పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో మమతా బెనర్జీ వర్గం తరఫున బరిలో ఉన్న సంచితా ప్రధాన్ (దే) తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. శుక్రవారం ఈ పరిణామం చోటుచేసుకుంది.
సువేందు అధికారితో సమావేశమైన అనంతరం సంచితా ప్రధాన్ పోటీ నుంచి తప్పుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడానికి ఒక రోజు ముందు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామంపై మమతా బెనర్జీ స్పందించారు. నందిగ్రామ్ నుంచి ఇక తమ వర్గం తరఫున మరో అభ్యర్థిని బరిలోకి దించబోమని ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి మిలాన్ ప్రధాన్‌కు మద్దతు ఇస్తామని తెలిపారు.
భాజపా ప్రతిపక్షాలను అంతం చేయాలని కుట్రలు చేస్తోందని మమత ఆరోపించారు. తన వర్గం నుంచి ఎవరూ పోటీ చేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి ఇది చీకటి రోజని ఆమె వ్యాఖ్యానించారు. ఇవి మమత చేసిన రాజకీయ ఆరోపణలు.
ఇదిలా ఉండగా, నందిగ్రామ్ ఉప ఎన్నికలో మమత మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ అభ్యర్థి మిలాన్ ప్రధాన్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్ తెలిపింది. 2007లో భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలకు సంబంధించిన పాత కేసులో ఆయనను అరెస్ట్ చేసినట్లు కాంగ్రెస్ పేర్కొంది. నందిగ్రామ్‌తోపాటు రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో నందిగ్రామ్‌లో చోటుచేసుకున్న పరిణామాలు ఎన్నికల సమీకరణాల్లో మరో కీలక మలుపుగా మారాయి.

## వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**బాన్సువాడ,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం)**

వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి జిల్లా ఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులు నిమజ్జన రూట్‌ను పరిశీలించారు. బాన్సువాడ పట్టణంలోని పాత బాన్సువాడ చావిడి నుంచి కల్కి చెరువు వరకు నిమజ్జన రూట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవ కమిటీలు,భక్తులు పోలీసు మరియు అధికార యంత్రాంగానికి సహకరించాలని సూచించారు.
నిమజ్జన రూట్‌లో ట్రాఫిక్ నియంత్రణ,విద్యుత్ సౌకర్యాలు, పారిశుద్ధ్యం,తాగునీరు, భద్రతా చర్యలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గంగాధర్, కృష్ణ రెడ్డి,మాసాని శ్రీనివా రెడ్డి , అబ్దుల్ ఖలేఖ్,గోపాల్ రెడ్డి,వెంకన్న,శివదయాళ్ ఎజాస్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## చందాపూర్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతపై విద్యార్థుల్లో సృజనాత్మక చైతన్యం

- **వ్యాసరచన,చిత్రలేఖనం పోటీలతో పరిశుభ్రతపై అవగాహన**

**వనపర్తి,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

'స్వచ్ఛత హై సేవా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు వనపర్తి మండలం చందాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు.
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'పరిశుభ్రత పరిసరాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీ, 'తడి చెత్త-పొడి చెత్త-శానిటరీ చెత్త-ప్రమాదకర చెత్త' అంశాలపై చిత్రలేఖనం పోటీ నిర్వహించారు.
విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని పరిశుభ్రత, చెత్త వర్గీకరణ,పరిసరాల పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానం తదితర అంశాలను తమ రచనలు,చిత్రాల ద్వారా చాటిచెప్పారు.తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం,చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరించడం,పరిశుభ్రమైన పరిసరాల ప్రాధాన్యతను విద్యార్థులు సృజనాత్మకంగా వివరించారు.
పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు గ్రామ పంచాయతీ తరఫున సర్పంచ్ నిర్మల మహేందర్ బహుమతులు అందజేశారు.
విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా కుటుంబాలు, గ్రామాల్లోనూ స్వచ్ఛతపై చైతన్యం తీసుకురావచ్చని ఆమె తెలిపారు.
కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. బొజ్జిబాబు,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్,బర్ల మహేందర్,ఉపాధ్యాయులు డి. శ్రీనివాస్ రెడ్డి,వై.విష్ణు, పి. మంజుల తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ కట్టడికి ప్రత్యేక చర్యలు

- **కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**
- **ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయించాలి**
- **ఎన్‌టీఆర్ కాలనీలో డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి,సెప్టెంబరు 18 (ప్రజాక్షేత్రం):**

డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను గుర్తించి తొలగించడంతో పాటు, జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయించాలని ఆదేశించారు.

**ఎన్‌టీఆర్ కాలనీలో పరిశీలన**

వనపర్తి పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల డెంగ్యూ కేసు నమోదైన ఇంటిని సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు. ఇంటి పరిసరాలు, డ్రైనేజీ, నీటి నిల్వలు, దోమల వృద్ధికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. కేసు నమోదైన ఇంటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు.

**ప్రతిరోజూ నీటి నిల్వల గుర్తింపు**

డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో నిరంతర చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వారానికి ఒక రోజు నిర్వహించే డ్రైడే కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రతిరోజూ ఇళ్లను, పరిసరాలను పరిశీలించి నీటి నిల్వలను గుర్తించి తొలగించాలని సూచించారు. దోమల లార్వా కనిపించిన ప్రాంతాల్లో వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి తదితర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు చేయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ పాత్రలు, ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చూడాలని తెలిపారు. జ్వరం,ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్,మున్సిపల్ కమిషనర్ నిరంజన్,కౌన్సిలర్ రవి,గిర్దవర్ మధుసూదన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి,ఆరోగ్య, మున్సిపల్ శాఖల సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## బిఆర్ఎస్ పార్టీ పోరాట ఫలితమే 22 ఏ నిషేధిత భూముల తొలగింపు

- **సిసిఎల్ఏ ఉత్తర్వులు ఇవ్వడంపై గుంజెటి సర్పంచ్ బొమ్మ దేశెట్టి పాటిల్**

**జహిరాబాద్,సెప్టెంబరు 18 (ప్రజాక్షేత్రం):**



గతకొద్దీ రోజులుగా రాష్ట్రంలో రైతుల భూములను రాష్ట్ర ప్రభుత్వం 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై బిఆర్ఎస్ పార్టీ నిరసనలు, ధర్నాలు చేసి రైతులకు సంబంధించిన పట్టా భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని కోరుతూ పోరాటాలు చేసినందునే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి శుక్రవారం నాడు సిసిఎల్ఏ ప్రభుత్వ ఉత్తర్వు ఆర్టీ నెంబర్ 564. 17092026 ను జారీ చేసి రైతుల భూములను 22 ఏ నిషేధిత జాబితా నుండి తొలగించిందనీ గుంజెటి గ్రామ సర్పంచ్ దేశెట్టి పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో రైతుల సమస్యలను తెలిసి పోరాటాలు చేసేది కేవలం బిఆర్ఎస్ పార్టీ మాత్రమే అని సర్పంచ్ దేశెట్టి పాటిల్ అన్నారు.

## రూ.11.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్

- **వెల్టూరులో సెమీ రెసిడెన్షియల్ విధానంలో నిర్మాణం**
- **స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబరు 18 (ప్రజాక్షేత్రం):**

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో పెద్దమందడి మండలం వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. రూ.11.75 కోట్ల అంచనా వ్యయంతో సెమీ రెసిడెన్షియల్ విధానంలో అత్యాధునిక పాఠశాలను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మించనున్న స్థలాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. విద్యార్థులకు అనువుగా పాఠశాల భవనం, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య**

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు పరిమితమైన ఆధునిక విద్యా ప్రమాణాలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను సెమీ రెసిడెన్షియల్ విధానంలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.
నాణ్యమైన బోధనతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. విద్యార్థులు పాఠశాలకు సులభంగా చేరుకునేందుకు ప్రత్యేక బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించే విధానాన్ని కూడా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

**ఉపాధ్యాయులకు విదేశీ విద్యా విధానాలపై అవగాహన**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి అక్కడి విద్యా వ్యవస్థ, బోధనా పద్ధతులు, సాంకేతిక వినియోగం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి విధానాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.
విదేశాల్లో అమలవుతున్న ఉత్తమ విద్యా విధానాలను అధ్యయనం చేసి తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**విద్యార్థులకు విద్యా సామగ్రి, ఇతర సౌకర్యాలు**

విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడంతో పాటు తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేఘారెడ్డి చెప్పారు. ఒక్కో విద్యార్థికి సుమారు రూ.1,400 విలువైన కిట్ అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన, ఆధునిక మౌలిక వసతులు, రవాణా సౌకర్యం, విద్యా సామగ్రి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఉద్దేశమని పేర్కొన్నారు.
అనంతరం విద్యార్థులతో ఎమ్మెల్యే మేఘారెడ్డి ముచ్చటించారు. వారితో కలిసి సెల్ఫీలు దిగుతూ కాసేపు సరదాగా గడిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు,యువకులు, గ్రామ పెద్దలు,గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుంటేనే రైతులకు విశిష్ట సంఖ్య కేటాయింపు

- **గ్రామాల్లోని రైతులు ఏఈఓ లను సంప్రదించి పూర్తి చేసుకోవాలి**
- **రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు త్వరగా చేయించుకోవాలి కోహిర్ మండల ఏఓ నవీన్**

**జహీరాబాద్,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందాలంటే రైతులు ఈకేవైసీ తో పాటు ఫార్మర్ రిజిస్ట్రి తప్పనిసరిగా చేసుకోవాలని, ప్రక్రియను పూర్తి చేసుకున్న రైతులకే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వచ్చే అవకాశం ఉందని కోహిర్ మండల వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్ అన్నారు. మండల ఏఓ మాట్లాడుతూ కోహిర్ మండలంలోని అన్నీ గ్రామాలకు చెందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని,దాని కోసం కావలసిన పత్రాలు పట్టాదార్ పాస్ బుక్కు,ఆధార్ కార్డు జిరాక్స్, చెలామణిలో బ్యాంకు ఖాతాను తమ తమ రైతు వేదికల్లో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇచ్చినట్టయితే వారు ఆన్లైన్ లో రిజిస్టర్ ప్రక్రియను పూర్తి చేస్తారని, ప్రక్రియ పూర్తైనా రైతులకే ప్రయోజనాలు చేకూరాతాయని,గ్రామాల్లో ప్రభుత్వం నియమించిన సిబ్బంది ద్వారా పంట వివరాలను నమోదు చేసుకుంటున్నారని,రైతులు అధికారులకు అందుబాటులో ఉండి పంట వివరాలను చూసుకోవాలని రైతులతో కోరారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందుతాయి

- **తెలంగాణ ఉద్యమకారుడు వార్డు మెంబర్ కావలి శేఖర్**

**నవాబుపేట్,సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదలకు పెన్షన్లు అందుతాయని తెలంగాణ ఉద్యమకారుడు కావాలి శేఖర్ అన్నారు. ప్రధానంగా వితంతులు ఒంటరి మహిళలు దివ్యాంగులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కల్లుగీత చేనేత కార్మికులు ఫైలేరియా బాధితులకు తెలంగాణ లో కొత్త పింఛన్లు అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందుతాయి అని తెలిపారు.



ప్రజాక్షేత్రం
ప్రతి క్షణం.. ప్రజల పక్షం

# ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పట్టిస్తే చర్యలు

- **ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పట్టిస్తే చర్యలు**
- **సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి**
- **అర్జీదారులను గౌరవించి సమస్యలు పరిష్కరించాలి**
- **ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.**

**వనపర్తి,సెప్టెంబరు 18 (ప్రజాక్షేత్రం):**



ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ఉప ప్రణాళిక నిధులు నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సామాజిక, న్యాయపరమైన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

శుక్రవారం వనపర్తి జిల్లాకు వచ్చిన బక్కి వెంకటయ్యకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,ఎస్పీ సునీతారెడ్డి పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు.అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.వివిధ శాఖల పరిధిలో ఎస్సీ,ఎస్టీల సమస్యలు,అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాల అమలు, పరిహారం, రిజర్వేషన్లు తదితర అంశాలపై సమీక్షించారు.

**అర్జీదారులను గౌరవించాలి**

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించడం అధికారుల బాధ్యత అని బక్కి వెంకటయ్య అన్నారు. అర్జీదారులతో మర్యాదగా వ్యవహరించి,వారి సమస్యలను సావధానంగా విని,నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం కలిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

**అట్రాసిటీ కేసులపై వేగంగా దర్యాప్తు**

ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు చట్ట ప్రకారం వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని చైర్మన్ సూచించారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులను పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. కేసుల దర్యాప్తు,బాధితులకు పరిహారం అందించే ప్రక్రియలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ఎఫ్ఎస్ఎల్‌కు సంబంధించిన కేసులు పెండింగ్‌లో లేకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు.భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

**పరిహారం సకాలంలో అందించాలి**

వివిధ కేసుల్లో ఎస్సీ, ఎస్టీ బాధితులకు అందాల్సిన పరిహారంతో పాటు విదేశీ విద్య, కులాంతర వివాహాలకు సంబంధించిన ఆర్థిక సహాయం తదితర ప్రయోజనాలు పెండింగ్‌లో లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిహారాలు పెండింగ్‌లో ఉంటే వాటి వివరాలను నివేదిక రూపంలో అందించాలని సూచించారు. ఈ నెల 22న ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో అంశాలను ప్రస్తావించి నిధుల విడుదలకు చొరవ తీసుకుంటామని తెలిపారు.

**పథకాలపై విస్తృత ప్రచారం**

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా, ఉపాధి పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని చైర్మన్ సూచించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలు, పబ్లిక్ పాఠశాలల్లో సీట్లు, ఉన్నత విద్య, విదేశీ విద్యకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, భూమి ఆధారిత పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలపై అర్హులకు సమాచారం అందించి వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు సహకరించాలన్నారు.

**రిజర్వేషన్ల అమలులో నిర్లక్ష్యం వద్దు**

అన్ని ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ విధానం, రిజర్వేషన్ రిజిస్టర్లను నిబంధనల మేరకు నిర్వహించాలని ఆదేశించారు. రిజర్వేషన్ల అమలులో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

**కాలనీల్లో మౌలిక వసతులు**

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకోవాలని ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు.

అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల నియామకాల్లో ఎస్టీలకు తగిన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా పరికరాలు, రక్షణ కల్పించడంతో పాటు జీతాలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. పెండింగ్ బకాయిలుంటే పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు.

**అటవీ భూముల సమస్యలు నివేదించాలి**

ఈ నెల 22న ముఖ్యమంత్రితో సమావేశం ఉన్నందున జిల్లాలోని అటవీ భూములకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని బక్కి వెంకటయ్య సూచించారు. ఆయా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

వనపర్తిలో అంబేద్కర్ కళాభవనం ఏర్పాటుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసేందుకు కూడా కృషి చేస్తామని తెలిపారు.

**అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు**

సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను సేకరించి, కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు, నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న కేంద్రాలకు వి.బి.జి. రామ్‌జీ పథకం కింద భవనాలు మంజూరయ్యేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

**మూడు నెలలకోసారి విజిలెన్స్ కమిటీ**

ప్రతి నెలా తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, అందులో తహసీల్దార్లతో పాటు ఎస్‌ఐలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొనేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీల సమస్యలు, కేసుల పురోగతిని సమీక్షించాలని తెలిపారు. సమావేశంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మణ్,రాంబాబు నాయక్,అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్,వినోద్‌కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీరావు,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్,సామాజికవేత్త గంధం నాగరాజు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలో ఘనంగా ప్రారంభమైన ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలు

**నంద్యాల,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**









నంద్యాల గవర్నమెంట్ మెడికల్ కాలేజీ నందు సెప్టెంబర్ 17 నుండి 23 వరకు '6వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలు' జరుగుతున్నాయి."ఫార్మాకోవిజిలెన్స్ ద్వారా ఔషధాల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహించడం సురక్షితమైన ఆరోగ్య సంరక్షణ వైపు ఒక అడుగు" (ప్రమోటింగ్ రేషనల్ యూస్ ఆఫ్ మెడిసిన్స్ త్రో ఫార్మాకోవిజిలెన్స్ఏ స్టెప్పు వర్డ్స్ సఫార్ హెల్త్ కేర్) అనే ప్రధాన నినాదంతో ఈ ఏడాది 6వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాలను సెప్టెంబర్17 నుండి 23 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ప్రజల్లో, వైద్యుల్లో మిగతా ఆరోగ్య సిబ్బందిలో మందుల సురక్షిత వినియోగంపై మరియు వాటి దుష్ప్రభావాల నివేదనపై విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. భారతీయ జనాభా ఆరోగ్యాన్ని సంరక్షించడం ,మందుల వల్ల కలిగే దుష్ప్రభావాల (రిస్క్) కంటే వాటి వల్ల కలిగే ప్రయోజనాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యం అని అన్నారు.

**ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యాలు మరియు ఉద్దేశాలు:**

రోగుల భద్రత (పేటియంట్ సేఫ్టీ): మందుల వాడకం వల్ల వచ్చే దుష్ప్రభావాలను (అడ్వైస్ డ్రగ్స్ రీజన్స్ అడ్రస్) నిరంతరం పర్యవేక్షించడానికి మరియు మందుల సంబంధిత ప్రమాదాలను తగ్గించడానికి దేశవ్యాప్త భద్రతా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం,

లాభనష్టాల విశ్లేషణ బెనిఫిట్ రిస్కు అనాలసిస్): భారతీయ మార్కెట్లో అందుబాటులో ఉన్న ఔషధాల వల్ల కలిగే ప్రయోజనాలు మరియు వాటి వల్ల వచ్చే నష్టాల నిష్పత్తిని నిరంతరం అంచనా వేయడం, కొత్త సంకేతాల గుర్తింపు సిగ్నల్ డిటెక్షన్ నివేదించబడిన కేసుల డేటా ఆధారంగా మందుల వల్ల కలిగే కొత్త భద్రతా సమస్యలను లేదా ఊహించని దుష్ప్రభావాలను గుర్తించి, వాటిని విశ్లేషించడం జరిగింది. ప్రజలు కూడా వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని, ఎలాంటి దుష్ప్రభావాలు కనిపించినా వెంటనే నివేదించాలని కోరుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఫార్మాకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శాంతబాయి, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ,మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శాంతి,డాక్టర్ జయశ్రీ,డా.సౌమ్య,డా. నాగజ్యోతి అలాగే ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన కిరణ్ రెడ్డి

**వలిగొండ,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**



వలిగొండ మండలం మొగిలిపాక గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మచ్చ రాములు,మచ్చ ముత్యాలు మచ్చ పోషమ్మ మరణించారు అని తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూలమాల వేసి వారి కుటుంబానీ పరామర్శించి వారికి 10,000 ఆర్థిక సహాయం ను మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య,గ్రామశాఖ అధ్యక్షుడు బీమనబోయిన బిక్షపతి,ఉప సర్పంచ్ షేక్ సైదులు,వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్,మచ్చ సునీత స్వామి,మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య,మాజీ ఉప సర్పంచ్ బీమనబోయిన నర్సింహ,మాజీ పాల సంఘం చైర్మన్ పబ్బు సత్తయ్య,మద్ది పాండు రంగ రెడ్డి మాజీ వార్డు సభ్యులు జడిగే సత్యరాములు,ముద్దసాని శేఖర్ రెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు జడిగే గోపాల్,ఉక్కుర్తి బిక్షపతి,జక్క శ్రీనివాస్ రెడ్డి,జమచ్చ నవీన్, పబ్బు మల్లేష్,కొండమీదీ సురేందర్,గుండాల రమేష్,మొగిలిపాక పెంటయ్యా, మర్ల లక్ష్మయ్య,సింగం మహేష్,పబ్బు బాలకృష్ణ, బీమనబోయిన మచ్చేందర్,షేక్ ఖాసీం,షేక్ అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# యువత భవితకు భరోసా ముఖాముఖికి ఎంపీ బైరెడ్డి శబరి

**నంద్యాల,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**







కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవితకు భరోసా ఇచ్చేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర విద్య,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లు ప్రత్యేక చొరవతో రాష్ట్ర యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పించేందుకు చేపడుతున్న పథకాలు,నూతన భారీ పరిశ్రమల ఏర్పాటు, ఆధునిక టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి పథకాలు, ఆధునిక శిక్షణ తదితర అంశాలు విద్యార్థులకు వివరిస్తూ, యువత తన సొంత కాళ్ళపై నిలబడుతూ,తోటి యువకు ఉపాధి ఇచ్చేలా తయారు కావాలని పిలుపు నిస్తూ, యువతలో చైతన్యం కోసం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు,లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం చుడిగాలి పర్యటనలు చేశారు.

ఉదయం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన "యువత భవితకు భరోసా" ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు,యువతతో నేరుగా ముచ్చటించారు.

యువత ఆశయాలు,వారి విద్య, నైపుణ్యాభివృద్ధి ,ఉపాధి అవకాశాలపై వారితో మాట్లాడి, వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన "యువత భవితకు భరోసా" ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, యువతతో నేరుగా ముచ్చటించి వారి ఆశయాలు,విద్య, నైపుణ్యాభివృద్ధి,ఉపాధి అవకాశాలపై చర్చించారు. వారి అభిప్రాయాలు,సమస్యలను తెలుసుకుని,భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమైన అవకాశాలపై వారితో మాట్లాడారు.

సాయంత్రం శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామంలోని ప్రభాత్ విద్యాసంస్థలో యువత భవితకు భరోసా ముఖా ముఖి నిర్వహించారు. నేటి యువత స్వశక్తితో సమాజంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎలా తీసుకోవాలి,ఏ ఏ పథకాలు ఉన్నాయి ,వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, యువత పోటీ తత్వంలో నిలిచేందుకు ఆధునిక శిక్షణ ఎలా అందుకోవాలి అన్న అంశాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.విద్యార్థుల నుంచి కూడా సలహాలు, సూచనలు తీసుకోవడం ప్రత్యేకం.

# యూపీఐ చెల్లింపు ఛార్జీలు రద్దు చేయాలి

- **సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నిరసన**

**మహేశ్వరం,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

మోడీ ప్రభుత్వం భవిష్యత్తు అంతా డిజిటల్ మయమని చెప్పి,క్యాష్ లెస్ కాలం అంటూ ఇప్పుడు దేశ ప్రజలపై ఫోన్ పే,గూగుల్ పే లాంటి చెల్లింపులపై ఛార్జీలు బాదడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణగూడ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ హైదరాబాద్ డివిజన్ నాయకులు బి ఎస్ కృష్ణ అధ్యక్షతన వహించారు.లింగం గౌడ్ వరలక్ష్మిలు మాట్లాడుతూ యూపీఐ ఛార్జీల పేరుతో ప్రజలను,చిరు వ్యాపారులను నిలువు దోపిడీ చేస్తున్నారని వారు అన్నారు. రూ.2వేల వరకు వసూళ్లు లేవని చెప్పినా,అది ప్రజలపై భారమేనని వారు అన్నారు.కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రైతులు కల్పిస్తూ, ప్రజలకు మాత్రం పన్నులు విధిస్తున్నారని,ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని,సామాన్యులపై భారం మోపుతున్న బీజేపీ ప్రభుత్వ వైఖరి నశించాలని నినాదాలు చేశారు.

కొన్నేళ్లుగా ఉచితంగానే డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం,తాజాగా యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గ పూరితమని మండిపడ్డారు. అమెరికా,వీసా,మాస్టర్ కార్డుల ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యకు ఉపక్రమించటం సిగ్గుచేటు అన్నారు.తక్షణమే మోడీ ప్రభుత్వం ఇలాంటి ప్రజావ్యతిరేక చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై భారం వేసే మోడీ ప్రభుత్వ చర్యలను అన్ని వర్గాల ప్రజలు నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం ఎల్) మాస్ లైన్ నాయకులు నారాయణ,వెంకటేశ్,కొల్లూర్ భీమేష్,కుంబోజి కిరణ్,నరేందర్ ముస్తాదు,వై.సత్తయ్య, మాజిద్, సుధాకర్ శ్రీను రమేష పి,వై,ఎల్ పి డి ఎస్ యు టి, యు,సి,ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా 'భవిత'

- **పెబ్బేరులో నూతన కేంద్రం ప్రారంభం.**
- **మార్కెట్ యార్డులో అదనపు కార్యాలయ గదులు.**
- **విద్య, వ్యవసాయ రంగాల మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యం**
- **ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబరు 18 (ప్రజాక్షేత్రం):**

ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులకు సమగ్ర విద్య, అవసరమైన సహాయ సేవలు అందించడంతో పాటు రైతులకు మార్కెట్ యార్డుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.విద్య, వ్యవసాయ రంగాల మౌలిక వసతులను బలోపేతం చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

శుక్రవారం పెబ్బేరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెబ్బేరు పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు.

**ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేక శిక్షణ**

ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యాలకు అనుగుణంగా విద్య, శిక్షణ, సహాయక సేవలు అందించేందుకు భవిత కేంద్రం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ,కమ్యూనికేషన్, స్వయం ఆధారిత నైపుణ్యాల అభివృద్ధితో పాటు సాధారణ పాఠశాల విద్యకు అనుసంధానం చేసేందుకు అవసరమైన సహకారం అందించనున్నట్లు చెప్పారు. ప్రతి చిన్నారికి సమాన విద్యా అవకాశాలు కల్పించి, వారిలోని ప్రతిభను వెలికితీయడమే సమగ్ర విద్య లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

**మార్కెట్ యార్డుకు అదనపు వసతులు**

అనంతరం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిపాలనా కార్యకలాపాల కోసం రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు కార్యాలయ గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. నూతన గదులు అందుబాటులోకి రావడంతో అధికారులు,సిబ్బంది విధులు నిర్వహించేందుకు మరింత సౌకర్యం కలగడంతో పాటు రైతులు,వ్యాపారులకు అందించే సేవలు మెరుగుపడనున్నాయని తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు మార్కెట్ యార్డుల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే చెప్పారు.నియోజకవర్గంలో విద్య, వ్యవసాయం,మౌలిక వసతుల రంగాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డు అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి,ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి,జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిర, అధ్యక్షుడు కోదండరామిరెడ్డి, కౌన్సిలర్లు రంజిత్‌కుమార్, సురేందర్‌గౌడ్,యుగేందర్‌రెడ్డి, పేపర్ల రాంరెడ్డి,రాములు యాదవ్,మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపు ఎప్పుడు?

- **సంగిశెట్టి క్రిస్టఫర్, టీఎంయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు**

**వలిగొండ,సెప్టెంబర్ 18 (ప్రజా-క్షేత్రం):**



తెలంగాణ రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం ఎందుకు కాలయాపన చేస్తుందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంపుం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రభుత్వం తలచుకుంటే ఉద్యమకారులను గుర్తించడంలో వారం రోజులు పట్టదని డానీ నేటికీ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వేసి నాలుగు నెలలు దాటిందని నేటీ వరకు అడ్రస్ లేదని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని ఎందుకు ఈ ధోరణి అవలంవిస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన అవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాలయాపన చేయకుండా తొందరగా రెండు రోజులో ప్రత్యేక వెబ్ సైట్ ప్రాదంభించాలని ఆయన డిమాండ్ చేశారు.త్యాగాల పునాదుల మీద పర్వక్ష తెలంగాణ రాష్ట్రంలో త్యాగాలకు గుర్తింపు లేకుంటే చరిత్ర క్షమించదని ఆయన అన్నారు.



## ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

**నంద్యాల,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 76వ జన్మదినం,ఆయన 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని పాములపాడు మండలంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు,జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 'సేవా-సంకల్ప్ అభియాన్'లో భాగంగా పాములపాడు, రుద్రవరం,లింగాల గ్రామాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వాద దీపాలు వెలిగించారు.

ఈ సందర్భంగా దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో,సంపూర్ణ ఆరోగ్యంతో,దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని,మరింత కాలం దేశ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ప్రజలు దీపాలు వెలిగించి తమ అభిమానాన్ని, శుభాకాంక్షలను తెలియజేశారు. గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 'సేవా-సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రజాసేవే లక్ష్యంగా రక్తదాన శిబిరాలు,పరిశుభ్రతా కార్యక్రమాలు,సామాజిక సేవా కార్యక్రమాలు,ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను బీజేపీ శ్రేణులు నిర్వహించనున్నట్లు రాయపాటి మురళీమోహన్ తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ సేవా ప్రస్థానం స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేయాలనే సంకల్పంతో పార్టీ కార్యకర్తలు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా 'సేవే లక్ష్యం - దేశమే ప్రథమం' అనే స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు.గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో మౌలిక వసతులు,సంక్షేమం, సాంకేతికత,ఆర్థిక అభివృద్ధి వంటి పలు రంగాల్లో జరుగుతున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కూడా సేవా-సంకల్ప్ అభియాన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాములపాడు మండలంలోని ప్రతి గ్రామంలో బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటాయని,ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని రాయపాటి మురళీమోహన్ అన్నారు.

గ్రామాల్లో జరిగిన ఆశీర్వాద దీపాల కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, గోపాలకృష్ణయ్య,బీజేపీ కార్యకర్తలు రవి,ఇమ్రాన్, మహమ్మద్ భాష తదితరులు, పార్టీ శ్రేణులు ,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరులను దర్శించుకున్న శివసేనారెడ్డి.

**వనపర్తి,సెప్టెంబరు 18 (ప్రజాక్షేత్రం):**

వినాయక చవితి ఉత్సవాలతో వనపర్తి జిల్లా కేంద్రం భక్తిశ్రద్ధలతో కళకళలాడుతోంది. వివిధ వార్డులు,కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది.ఈ సందర్భంగా వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి శుక్రవారం పలు మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా కేంద్రంలోని 12, 32, 30వ వార్డులతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు వెళ్లిన ఆయన గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించి ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.


**డప్పు మేళాలతో స్వాగతం**

శివసేనారెడ్డి ఆయా మండపాల వద్దకు చేరుకున్న సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చరణలు, డప్పు మేళాల నడుమ ఆయనను మండపాల వద్దకు తీసుకెళ్లారు. పలుచోట్ల పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని గణనాథుడికి మొక్కులు చెల్లించారు.

**ఏర్పాట్లపై ఆరా**

మండపాల నిర్వాహకులతో శివసేనారెడ్డి ఆత్మీయంగా మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పూజా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని ఆకాంక్షించారు. మండపాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. రాత్రివేళ విద్యుత్ దీపాలంకరణలతో మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో వనపర్తి ప్రజలకు శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు కలగాలని శివసేనారెడ్డి ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులను అభినందించారు.కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు యాదవ్,ఓబీసీ నాయకుడు చంద్రమౌళి,వైస్ చైర్మన్ మధుసూదన్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్,కౌన్సిలర్లు క్రాంతికుమార్‌గౌడ్,నక్కరాజు, యువజన కాంగ్రెస్ నాయకులు శివకుమార్ నాయుడు, అరవింద్ నాయక్,తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## తారకరామనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసోత్సవం.

**యాదాద్రి భువనగిరి జిల్లా, సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**




భువనగిరి పట్టణంలోని తారకరామనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భువనగిరి ఐసీడీఎస్ ఏసీడీపీవో యామిని మాట్లాడుతూ శిశువు ఎదుగుదలలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమని తెలిపారు.తక్కువ ఖర్చుతో లభించే స్థానిక పౌష్టికాహారాన్ని నిత్యం తీసుకోవడం ద్వారా రక్తహీనత,పోషకాహార లోపాలను అధిగమించవచ్చని వివరించారు.

ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పద్మ,మహిళా సాధికారత బృందం ప్రతినిధులు నిఖిత,భార్గవి,అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్య,రుక్మిణి,శ్రీలత పాల్గొన్నారు.గర్భిణులు, బాలింతలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## 7 వేల ఎకరాలకు సాగునీరు రాకపోవడానికి మాజీ ఎమ్మెల్యే కారణం

- **దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**
- **ఘనపూర్ బ్రాంచ్ కెనాల్‌లో 2 కి.మీ.,డి12 కాలువలో 300 మీటర్ల పనులు పెండింగ్.**
- **చిన్న పనులతో వేలాది ఎకరాలకు సాగునీరు**

**మహబూబ్ నగర్ జిల్లా, సెప్టెంబర్ 18(ప్రజా-క్షేత్రం):**



కేఎల్‌ఐ ఘనపూర్ బ్రాంచ్ కెనాల్ ద్వారా దేవరకద్ర నియోజకవర్గంలో సుమారు 7 వేల ఎకరాల ప్రత్యక్ష ఆయకట్టుకు,మరో 4-5 వేల ఎకరాల పరోక్ష ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ,గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రయోజనం రైతులకు పూర్తిస్థాయిలో అందలేదని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆరోపించారు.

కేఎల్‌ఐ కాలువల పనులను గతంలోనే పూర్తి చేసి ఉంటే ఈ ప్రాంతంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగేదని,వేలాది మంది రైతులకు సాగునీటి భద్రత కలిగేదని ఆయన పేర్కొన్నారు.ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే హయాంలో కాలువల పనులను పూర్తి చేయడంలో తగిన శ్రద్ధ చూపలేదని ఎమ్మెల్యే జిఎంఆర్ విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే స్వయంగా కాంట్రాక్టు పనులతో సంబంధం కలిగి ఉన్నారని,ప్రజాప్రతినిధిగా రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంలో వ్యక్తిగత కాంట్రాక్టు ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. కేఎల్‌ఐ కాలువల ద్వారా చెరువులను నింపితే చెరువుల్లోని మట్టిని తవ్వి తరలించే కాంట్రాక్టు పనులకు ఇబ్బందులు ఏర్పడతాయనే కారణంతో చెరువులను పూర్తి స్థాయిలో నింపలేదని ఆయన ఆరోపించారు.

చిన్న పనులు.. వేలాది ఎకరాలకు ప్రయోజనం ప్రస్తుతం ఘనపూర్ బ్రాంచ్ కెనాల్‌లో దాదాపు 2 కిలోమీటర్ల మేర, డి12 కాలువలో సుమారు 300 మీటర్ల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.ఈ పెండింగ్ పనులను పూర్తి చేస్తే దేవరకద్ర నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు.

కేఎల్‌ఐ కాలువల ద్వారా చెరువులను నింపడం వల్ల ప్రత్యక్షంగా సుమారు 7 వేల ఎకరాలకు, పరోక్షంగా మరో 4-5 వేల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. గతంలోనే ఈ పనులు పూర్తయి ఉంటే రైతుల సాగు పరిస్థితులు మరింత మెరుగుపడేవని పేర్కొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి**

రైతుల ప్రయోజనాల కంటే వ్యక్తిగత కాంట్రాక్టు ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చారా? కేఎల్‌ఐ కాలువల పనులు ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? చెరువులను పూర్తిస్థాయిలో ఎందుకు నింపలేదు? అనే అంశాలపై మాజీ ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే జిఎంఆర్ డిమాండ్ చేశారు.

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కాలువల పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దేవరకద్ర నియోజకవర్గ రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.

## పెట్టుబడులకు స్వర్గధామం ఫ్యూచర్ సిటీ: కేఎల్ఆర్

- **ఫ్యూచర్ సిటీలో ఎస్ బిఐ డేటా సెంటర్ కు 10 ఎకరాలు కేటాయింపు**
- **క్యూ కట్టిన అమెజాన్, టిసిఎస్ ,ఫార్చున్ కంపెనీలు**
- **త్రిబుల్ ఆర్, 330 ఫీట్ల గ్రీన్ ఫీల్డ్, విమానాశ్రయంతో మారిన ముఖచిత్రం**
- **విద్యుత్, రోడ్లు, వాటర్, డ్రైనేజీ వసతులకు ఎఫ్ సిడిఏ పెద్దపీట**

**మహేశ్వరం,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఫార్చున్ కంపెనీలు,ఎడ్యుకేషన్, మెడికల్ హబ్స్ క్యూ కడుతున్నాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.

తాజాగా ఎస్ బిఐ డేటా సెంటర్ కు కందుకూరు మండలం మీర్ఖాన్ పేటలో 10ఎకరాలు కేటాయించేందుకు తెలంగాణ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారు.ఇప్పటికే అమెజాన్,టిసిఎస్ , హాస్పటాలిటీ ప్రాజెక్టులు అతిపెద్ద డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. డిసెంబర్ 7నుంచి 9 వరకు రెండో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని కేఎల్ఆర్ గుర్తు చేశారు.ఈ సమ్మిట్ లో ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు సహా జాతీయ,అంతర్జాతీయ విద్య, వైద్య సంస్థలు పాల్గొంటాయని చెప్పారు.స్టార్టప్,క్లౌడ్ కంపెనీలకు సైతం కేరాఫ్ అడ్రస్ గా భవిష్యత్ నగరం మారనుందని,వచ్చే కంపెనీలకు మౌలిక వసతుల కల్పనలో రాజీ లేకుండా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నామని లక్ష్మారెడ్డి అన్నారు.స్కిల్ యూనివర్శిటీతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మరోసారి స్పష్టం చేశారు. బిల్డింగ్ నిర్మాణ పనులు సైతం వేగంగా జరుగుతున్నాయని కేఎల్ఆర్ చెప్పారు.మహేశ్వరం మండలం మొత్తం ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తే శరవేగంగా మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




## బాలాపూర్ గణనాథుని దర్శనానికి సీఎం మరియు డిప్యూటీ సీఎం కు ఆహ్వానం.

- **బాలాపూర్ గణనాథుని దర్శనానికి సీఎం మరియు డిప్యూటీ సీఎం కు ఆహ్వానం.**

**మహేశ్వరం,సెప్టెంబర్.18 (ప్రజాక్షేత్రం)**

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మరియు బాలాపూర్ గణేష్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి,కమిటి అధ్యక్షులు కళ్ళెం నిరంజన్ రెడ్డి, కమిటి సభ్యులు సంరెడ్డి ప్రభాకర్ రెడ్డి,టేకుల శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## కోకట్ కాగ్నానది దగ్గర కొనసాగుతున్న వినాయకుల నిమజ్జనోత్సవాలు.

- **అధికారుల విస్తృత ఏర్పాట్లు.**
- **బందోబస్తు తో అన్ని ఏర్పాట్లు పూర్తి.**
- **జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా.**
- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.**

**యాలాల,సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా యాలాల మండలం పరిధిలోని కోకట్ కాగ్నానది వద్ద వినాయక నిమజ్జనోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజా బాల్ రెడ్డి నిమజ్జనాన్ని సందర్శించారు.తాండూరు పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రదర్శించిన గణేష్ విగ్రహాలను ఇక్కడే నిమజ్జనం చేయడం ఎప్పటినుండో వస్తున్న ఆనవాయితీ.భక్తుల రద్దీ నిమజ్జనం వేడుకల కోసం అధికారులు విస్తృత ఏర్పాటు చేశారు. కాగ్నానది వంతెనకు ఇరు వైపులా ఉన్న ముళ్లపదలు, కంపచెట్లు జెసిబిలతో తొలగించి దారిని సుగమం చేశారు. భక్తుల రక్షణ కోసం నది ఒడ్డున కర్రలతో బలమైన బలమైన ఏర్పాటు చేశారు.భారీ విగ్రహాల వాహనాల రాకపోకలకు వీలుగా రోడ్డుపై ఉన్న గుంతలన పూడ్చి వేశారు.దాని పరిసర ప్రాంతాలలో ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలందుకున్న బొజ్జ గణపయ్యల విగ్రహాలను సాంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకొచ్చి ఇక్కడ గంగమ్మ వాడికి చేరుస్తున్నారు. భక్తుల గణపతి బప్పా మోరియా నినాదాలతో డప్పు వాయిద్యాలు,నృత్యాలతో కాగ్నానది తీరం ఆధ్యాత్మిక శోభతో మార్మోగుతుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా జరిగేలా అన్ని చర్యలు చేపట్టినట్టు అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులు అధికారుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు. రెవెన్యూ, విద్యుత్తు,అగ్నిమాపక, వైద్యం,పారిశుద్ధ్య కార్మికులు, సర్వం సిద్ధం చేశారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ గాయత్రి,యాలాల ఎస్ఐ విట్టల్ రెడ్డి,ఉప తహసిల్దార్ కిరణ్ కుమార్,ఆర్ ఐ చరణ్,ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గోపరాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన

- **గోపరాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన**

**వలిగొండ,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం పిల్లలకు గ్రామ సర్పంచ్ సలిగంజి పృథ్వి సామూహిక అన్నప్రాసన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో బాలింత తల్లులకు, పిల్లలకు అందించే ఆరోగ్యకరమైన భోజనాన్ని ఇతర కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అంగన్వాడీ టీచర్ సలిగంజి మణెమ్మ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఐదు సంవత్సరాలు లోపు చిన్నారులు అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టిక హారం తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ నవనీత,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,ఉప సర్పంచ్ పోలబోయిన లింగస్వామి,వార్డు మెంబర్లు,తల్లులు తదితరులు పాల్గొన్నారు.



## గణపతి మండపానికి ఆమ్ప్లిఫయర్ బహూకరించిన వాకిటి

**వలిగొండ,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో గల ఎస్సీ కాలనీలో నెలకొల్పిన గణపతి మండపానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి 20 వేల రూపాయల విలువగల ఆమ్ప్లిఫైయర్ ను బహుకరించారు.అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.అదేవిధంగా గ్రామ ఉపసర్పంచ్ గొడ్డేటి సత్యం యాదవ్ 5 వేల రూపాయల చందాను అందజేశారు .ఈ కార్యక్రమంలో ఆర్రూరు పిఎసిఎస్ డైరెక్టర్ ఆవుల స్వామి,వార్డు సభ్యులు వేముల అనిల్,రేఖ మత్స్యగిరి,కేదారి నరేష్,శివాజీ యూత్ అధ్యక్షులు బత్తిని కర్ణ గౌడ్,ఎర్ర సాయి గౌడ్, పాక మహేష్ యాదవ్,వేముల నరసింహ,వేముల ఎట్టయ్య, భోగారం అంజయ్య,వేముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# భక్తి పారవశ్యంలో వినాయక నిమజ్జనం

- **పెద్దేముల్ మండలంలో 108 వినాయకుల నిమజ్జనం**
- **5 రోజుల పూజల అనంతరం గణనాథులకు ఘనంగా వీడ్కోలు**
- **24 గ్రామ పంచాయతీల్లో ఘనంగా నిమజ్జనోత్సవం**
- **భక్తిశ్రద్ధలతో గణనాథులకు వీడ్కోలు**
- **శోభాయాత్రల్లో మార్మోగిన గణపతి నామస్మరణ**
- **పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిమజ్జనం**

**పెద్దేముల్,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులకు శుక్రవారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 108 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.వినాయక మండపాల వద్ద ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గణనాథుల విగ్రహాలను శోభాయాత్రగా నిమజ్జన ప్రాంతాలకు తరలించారు. డప్పు చప్పుళ్లు, భక్తుల నినాదాలతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో శోభాయాత్రల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఐదు రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథులను సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేయడంతో మండలంలో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.



# ఓ నా సిద్దయ్య ప్రోమో సాంగ్ విడుదల చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

- **300 మంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ పత్రాల పంపిణీ:కందకట్ల సిద్ది రెడ్డి.**

**శంషాబాద్,సెప్టెంబర్19 (ప్రజాక్షేత్రం)**

జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని మల్లిక గార్డెన్‌లో కందకట్ల సిద్ది రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన "ఓ నా సిద్దయ్య" ప్రోమో సాంగ్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శుక్రవారం ఘనంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 300 మంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు బీమా సదుపాయం కల్పించడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కందగట్ల సిద్ది రెడ్డి మాట్లాడుతూ తన సొంత ఊరైన శంషాబాద్‌లో "ఓ నా సిద్దయ్య" ప్రోమో సాంగ్‌ను విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుమ్మ మహేందర్ రెడ్డి,దూడల వెంకటేష్ గౌడ్,గణేష్ గుప్తా, బొబ్బిలి శేఖర్ ముదిరాజ్,అజయ్,బూచి రెడ్డి,ఇఫ్తాకర్ షరీఫ్,చంద్రబోస్,ఇంద్రసేన,బాలేశ్వర్,బుల్లెట్ బండి రామ్, లక్ష్మణ్, హిరోన్ కాంచయని,శామ్,నల్గొండ గద్దర్ నరసయ్య,కొమరక్క,కిషోర్,చక్రిధర్ రెడ్డి, శంకర్ రెడ్డి,లడ్డు,చేవెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# కలెక్టరేట్ గణనాథుడి శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి

- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఉద్యోగులకు అన్నదానం**

**మెదక్ సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం)**

జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించిన గణనాథుడికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి కి పుష్పాలు సమర్పించి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. కలెక్టరేట్ గణనాథుడి నిమజ్జన శోభాయాత్రను కూడా ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి సింధు, కలెక్టరేట్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# నిండు అసెంబ్లీలో అబద్ధాలు ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

- **బహదూర్ గూడ భూములలో కాంగ్రెస్ నాయకులే వ్యాపారాలు చేశారు**
- **మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు**

**శంషాబాద్,సెప్టెంబర్18 (ప్రజాక్షేత్రం):**

నిండు అసెంబ్లీలో శంషాబాద్ మండలం బహదూర్ గూడ భూములపై అబద్ధాలు మాట్లాడడం సరైన పద్ధతి కాదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.శుక్రవారం శంషాబాద్ మండలం బహదూర్ గూడ గ్రామం లో స్థానిక రైతులతో కలిసి వ్యవసాయం చేసుకుంటున్న భూములను పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి, కొత్వాల్ గూడ డివిజన్ అధ్యక్షుడు కొన్నమొల్ల శ్రీనివాస్ లు మాట్లాడుతూ నిండు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతూ కాలం వెళ్ళదీస్తున్నారని విమర్శించారు.శంషాబాద్ మండలం బదుర్ గూడ గ్రామంలోని భూములలో కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తో పాటు కొంతమంది నాయకులు వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని తెలిపారు. స్థానిక రైతులకు నష్టం కలవకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గ్రామస్తుల వైపు నిలబడ్డారు తప్ప ఎలాంటి వ్యాపారాలు చేయలేదని వివరించారు. సబితా ఇంద్రారెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామంలో ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహించి కొంతమందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడానికి సిద్ధం చేయగా అదే సమయంలో తెలంగాణ ఉద్యమం ప్రారంభం కావడంతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం నిలిచిపోయిందన్నారు. తాతలు కాలం నుండి వ్యవసాయాన్ని నమ్ముకొని వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్న రైతుల భూములపై కన్నేసినం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి బుల్లెట్ ట్రైన్ ఫార్మా కంపెనీల పేరుతో పేదలకు చెందిన భూములను లాక్కోవడం కోసం ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పై తప్పుడు ఆరోపణలు చేస్తూ రైతులకు మద్దతు తెలిపిన సబితా ఇంద్రారెడ్డి పేరును బదిలాం చేయడం తగదన్నారు. బదుర్ గూడ భూములను తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కెసిఆర్ చావు కోరుకోవడం మూర్ఖత్వం**

గత 60 ఏళ్ల నుండి తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతున్న స్వరాష్ట్ర సాధన కోసం కొంతమంది ఉద్యమాలు చేసిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణ రాకుండా అడ్డుకోవడంతోపాటు తెలంగాణ కోసం పోరాడిన నేతలపై అనేక కేసులు పెడుతూ ఇబ్బందులు గురి చేయడంతో తెలంగాణ ఉద్యమం అణిచివేయబడిందన్నారు. 2000 సంవత్సరంలో తెలంగాణలో ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర రావు 14 సంవత్సరాల పాటు ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఎంతమంది విమర్శలు చేసిన వెనక్కి తగ్గకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించే వరకు కోరుకునేది లేదని దేశ రాజకీయాలను ఒప్పించి మెప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాంటి వ్యక్తిని పట్టుకొని చావాలనుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన షాద్నగర్ ఎమ్మెల్యే శంకర్ మీడియా ముందు మాట్లాడడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఎంత విజ్ఞానం ఉందో తెలుస్తుంది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం బీఆర్ఎస్ నాయకులపై అరుపులు చేస్తూ ఆసక్తి ప్రచారాలు చేస్తూ తెలంగాణ సంపదను ఢిల్లీకి దోచిపెడుతున్నారనిఎద్దేవా చేశారు.



# భువనగిరిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

- **ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరుపుకోవాలని పిలుపు**

**యాదాద్రి భువనగిరి,సెప్టెంబర్18(ప్రజాక్షే త్రం):**

రాబోయే వినాయక నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలనే లక్ష్యంతో భువనగిరి పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ రక్షణ ఊరేగింపు నిర్వహించారు.భువనగిరి పట్టణ ఎస్ హెచ్ ఓ రమేష్ నాయకత్వంలో సిబ్బంది పట్టణంలోని ప్రధాన వీధులు, సున్నితమైన ప్రాంతాల గుండా మార్చ్ ఫాస్ట్ నిర్వహించి ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ రమేష్ మాట్లాడుతూ నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా జరుపుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. భక్తులు,ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

**ఉత్సవ కమిటీలకు, భక్తులకు ముఖ్యమైన సూచనలు.**

సమయ పాలన పాటించాలి, నిమజ్జన ఊరేగింపును నిర్ణీత సమయంలోనే ప్రారంభించి, పోలీసు అధికారులు సూచించిన మార్గాల్లోనే సాగించాలి.

మద్యపానం నిషేధం నిమజ్జన శోభాయాత్రలో మద్యపానం సేవించి పాల్గొనడం పూర్తిగా నిషేధం. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

నిబంధనలకు విరుద్ధంగా లౌడ్ స్పీకర్లు,అతి పెద్ద డిజె సిస్టమ్‌లను ఉపయోగించకూడదు. నిర్ణీత శబ్ద పరిమితి లోపే మైకులు వాడాలి.

**చెరువుల వద్ద జాగ్రత్తలు**

నిమజ్జన ఘాట్ల వద్దకు పిల్లలను, ఈత రాని వారిని నీటిలోకి దిగనివ్వకూడదు.కేవలం కేటాయించిన భద్రతా సిబ్బంది వాలంటీర్ల సహాయంతోనే నిమజ్జనం పూర్తి చేయాలి.

సోషల్ మీడియాపై నిఘా సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి అసత్య ప్రచారాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు చేయవద్దు. పుకార్లను నమ్మవద్దు.

అనుమానాస్పద వ్యక్తులు ఊరేగింపులో గానీ,మండపాల వద్ద గానీ ఏవైనా అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

శాంతిభద్రతల పరిరక్షణకు పట్టణమంతటా సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని,శాంతియుత వాతావరణంలో పండుగను ముగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# శంకర్‌పల్లిలో డ్రగ్స్ ముఠా పట్టివేత

- **ఒక గంజాయి పెడ్లర్ అరెస్ట్.**
- **ఐదుగురు వినియోగదారులను డీ-అడిక్షన్ కేంద్రానికి తరలింపు.**

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**



నషా ముక్త్ తెలంగాణ సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న దృఢమైన చర్యల్లో భాగంగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని శంకర్‌పల్లి పోలీసులు డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపారు. డ్రగ్స్ కేసుల్లో మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఉన్నతాధికారుల సూచనలతో శంకర్‌పల్లి పోలీసులు తమ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ విక్రయం, రవాణా, సరఫరాను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రెండు వేర్వేరు కేసుల్లో ఆరుగురిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో ఒకరు గంజాయి పెడ్లర్‌గా గుర్తించారు. అతని వివరాలు షేక్ అరిఫుల్, తండ్రి షేక్ హాఫీజుల్, వయస్సు 24 సంవత్సరాలు, నివాసం పంచాల గ్రామం, హౌరా తాలూకా, కోల్‌కతా, పశ్చిమ బెంగాల్ అతని వద్ద నుండి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా అతనిని రిమాండ్‌కు పంపింది.

**ఐదుగురు వినియోగదారులకు కౌన్సెలింగ్**

మిగిలిన ఐదుగురిని డ్రగ్స్ వినియోగదారులుగా గుర్తించారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎంఎస్.నెం.4, ఏచ్.ఏం & ఎఫ్. డబ్ల్యూ (జి) డిపార్ట్మెంట్ ప్రకారం, ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన (ఏ.టి.ఎఫ్.ఎస్)విధానం ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వైద్య ధృవీకరణ పొంది, వారి సమ్మతి మరియు న్యాయస్థానం ఆదేశాల మేరకు కౌన్సెలింగ్, వైద్య చికిత్స మరియు పునరావాసం కోసం డీఅడిక్షన్ కేంద్రాలకు తరలించారు.

**డ్రగ్స్‌పై పోలీసుల ప్రత్యేక శిక్షణ**

ఇటీవల ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ దుర్వినియోగాన్ని నివారించడం, పెడ్లర్లు, సరఫరాదారుల నెట్‌వర్క్‌ను అరికట్టడంపై పోలీసు అధికారులు, సిబ్బందికి ఈగల్, నక్రోటిక్స్ మరియు ఇతర ప్రత్యేక బృందాల సమన్వయంతో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు ప్రజలు సహకరించాలని, తమ పరిసరాల్లో జరుగుతున్న అక్రమ మాదకద్రవ్యాల కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని శంకర్‌పల్లి ఇన్స్పెక్టర్ రుద్వీర్ కుమార్ తెలిపారు.


# తెల్లాపూర్ అంబేద్కర్ కాలనీలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

**తెల్లాపూర్,సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

తెల్లాపూర్,అంబేద్కర్ కాలనీ,రోడ్ నంబర్ 7లో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నిర్వాహకులు వినాయకుడి లడ్డు ప్రసాదం ప్రత్యేకంగా ఆకర్షణీయంగా శివలింగ ఆకారంలో లడ్డు ఏర్పాటు చేయడం జరిగింది.

**విద్యార్థులు,వినాయకుడికి పెన్నులతో దండ అలంకరణ చేశారు.**

ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ గణనాథుడికి ప్రత్యేక పూజలు, భజనలు,హారతులు నిర్వహిస్తున్నారు.కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. చిన్నారులు,మహిళలు, యువత ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆదివారం భక్తులు,కాలనీ వాసుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి చిన్నారుల్లోని ప్రతిభను ప్రోత్సహించనున్నారు.ఏడు రోజుల ఉత్సవాలు ముగిసిన అనంతరం నిమజ్జనం రోజున చిన్నారులకు ప్రత్యేక ప్రసాదం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# ఘనంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

**వలిగొండ,సెప్టెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవాధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల ఆకాంక్షల కొరకు నిరంతరం పోరాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు బొడిగే సుదర్శన్, చిలుగూరి సత్తిరెడ్డి,మహిళా అధ్యక్షురాలు ఐటిపాముల పుష్ప,కళాకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మల్లం వెంకటేశం, ఫోరం జిల్లా కార్యదర్శి కదిరేని స్వామి,కొందూరు సత్తయ్య, పల్లెర్ల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.




# శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ

- **శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ**

**శ్రీశైలం, సెప్టెంబరు 18 (ప్రజాక్షేత్రం):**

లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీశైలం దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ఊయలసేవ నిర్వహించనున్నారు. ప్రతి శుక్రవారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజుల్లో ఈ సేవను నిర్వహిస్తారు. ముందుగా అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతి పూజ నిర్వహిస్తారు. అనంతరం ఊయలలో వేంచేసిన స్వామి, అమ్మవార్లకు షోడశోపచార పూజలు నిర్వహించి ఊయలసేవ చేపడతారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ, పుష్పార్చనలు నిర్వహించనున్నారు.



## నేడు చేవెళ్లలో కుసుమ విత్తనాల పంపిణీ కార్యక్రమం

- **శంకర్ పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి**

**శంకర్ పల్లి సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం)**



రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేవెళ్ల మండలానికి సంబంధించిన కుసుమ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు శంకర్పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి తెలిపారు. బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, నేడు ఉదయం 9:30 గంటలకు చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుసుమ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, శ్రేయోభిలాషులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొల్లారం వెంకట్ రెడ్డి సూచించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.

- **శంకర్‌పల్లి సీఐ జి. రుద్వీర్ కుమార్ హెచ్చరిక.**

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**




వినాయక నిమజ్జన శోభాయాత్రల్లో ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శిస్తే, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శంకర్‌పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. రుద్వీర్ కుమార్ హెచ్చరించారు. శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, వినాయక ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతియుతంగా నిమజ్జనాలు జరిగేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. నిమజ్జన శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్ణీత డెసిబుల్స్ కంటే ఎక్కువ సౌండ్ పెడితే కేసులు నమోదు చేస్తాం మద్యం సేవించి వాహనాలు నడపడం, శోభాయాత్రల్లో అసభ్యంగా ప్రవర్తించడం, ఇతర మతాలను కించపరిచేలా పాటలు, నినాదాలు చేయడం నిషేధం.


నిమజ్జనానికి ముందుగా పోలీస్ శాఖ నుండి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా విగ్రహాలు తరలిస్తే చర్యలు ఉంటాయి.

విద్యుత్ వైర్లు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా విగ్రహాల ఎత్తును పరిమితిలో ఉంచాలి.

యువత ఎవరైనా బైకులపై సైలెన్సర్లు తీసి హారెత్తిస్తూ వెళ్తే, వీలింగ్ చేస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు పెడతామని హెచ్చరించారు. "ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి. ప్రతి నిమజ్జన శోభాయాత్రను సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా గొడవలు, ఘర్షణలకు పాల్పడితే వెంటనే అదుపులోకి తీసుకుంటాం" అని సీఐ రుద్వీర్ కుమార్ స్పష్టం చేశారు. శంకర్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లోని వినాయక మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీలతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించామని, వారికి అవగాహన కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఏదైనా సమస్య ఉంటే వెంటనే డయల్ 100,112 కు లేదా శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## బోర్ మోటార్ వైర్ల దొంగల అరెస్టు

**మొయినాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**



మండల పరిధిలోని పెద్దమంగళారం, అప్పిరెడ్డిగూడ గ్రామాల్లో వ్యవసాయ పొలాలను లక్ష్యంగా చేసుకుని బోర్ మోటార్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను మొయినాబాదు క్రైమ్ పోలీసులు విజయవంతంగా అరెస్టు చేశారు. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఈ ప్రాంతంలోని పొలాలలో వరుసగా మోటార్ వైర్లు చోరీకి గురికావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా ముడిమ్యాల గ్రామానికి చెందిన యంజాల అరుణ్ కుమార్ అలియాస్ నాని, జొన్నాడ వంశీ అలాగే రావులపల్లికి చెందిన వద్దే చరణ్ కుమార్ ఈ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అన్నదాతల కష్టాన్ని దోచుకుంటున్న ఈ దొంగల ఆట కట్టించడంతో స్థానిక రైతులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. రాత్రి సమయాల్లో పొలాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాలను వినియోగించుకోవాలి

- **చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్**

**మొయినాబాద్, సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాలను వినియోగించుకోవాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ అన్నారు. మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వార్డుకు చెందిన జిల్లెల్ల శ్రీశైలం తన సొంత ఖర్చులు వెచ్చించి విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ స్థానిక నాయకులతో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి విద్యాబుద్ధులను నేర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని వెల్లడించారు. క్రమశిక్షణతో చదివి పాఠశాలకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు షాబాద్ దర్శన్, మాజీ మండల అధ్యక్షులు మాణయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రేషన్‌కార్డు ఉన్న వారికి బిగ్ షాక్..
# వీరి రేషన్ నిలిపివేత..!

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

రేషన్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన ఆదేశం జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ పీడీఎస్ పథకం వచ్చే నెల నుంచి అమలులోకి రానుంది. దీనితో రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో రేషన్ కార్డులు రద్దు కానున్నాయి. కనీసం ఆరు లక్షలకు పైగా కార్డులు రద్దు కానున్నాయని సమాచారం. ఆరు నెలలకు పైగా రేషన్ తీసుకోని కార్డుదారులపై ఈ ప్రభావం పడనుంది. ఆరు నెలలకు పైగా ఉపయోగించని కార్డులు 16 లక్షలకు పైగా ఉన్నాయి. ఉపయోగించని కార్డులను యాక్టివేట్ చేయడానికి, కేవైసీని అప్‌డేట్ చేయాలి. స్మార్ట్ పీడీఎస్ అనేది రేషన్ కార్డు సభ్యుల సమాచారాన్ని కేంద్రంగా నిల్వ చేయడానికి, క్షేత్రస్థాయి వరకు పంపిణీని పూర్తిగా పర్యవేక్షించడానికి రూపొందించిన ఒక ప్రాజెక్ట్.

**ఆరు నెలలుగా రేషన్ తీసుకోలేదా?**

ఈ చర్యలు ప్రధానంగా ఆరు నెలలకు పైగా రేషన్ తీసుకోని వారిని ప్రభావితం చేస్తాయి. ఆరు నెలలకు పైగా తమ రేషన్ వాటాను తీసుకోని వారి కార్డులు నిలిచిపోయే అవకాశం ఉంది. దీని తర్వాత కార్డులోని సభ్యులందరూ మూడు నెలల్లోగా ఇకెవైసిని పూర్తి చేయాలి. అప్పుడే రేషన్ పంపిణీని తిరిగి పొందవచ్చు.

అంతేకాకుండా, ఒకే వ్యక్తి ఏదైనా రాష్ట్రంలో ఒకటి కంటే ఎక్కువ కార్డులలో ఉన్నారా లేదా అనే విషయాన్ని కూడా ఇది గుర్తిస్తుంది. ఒకవేళ అలా ఉంటే, వారి కార్డులు నిలిచిపోయే అవకాశం ఉంది. వారు మూడు నెలల్లోగా ఈ కెవైసిని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ దశలో ఏ రేషన్ కార్డును ఉంచుకోవాలో నిర్ణయించి, మిగిలిన వాటి నుండి వారి పేరును తొలగించాలి. ఈ చర్యలు స్మార్ట్ పీడీఎస్ పథకం మొదటి దశలోని పసుపు, గులాబీ వర్గాలపై ప్రభావం చూపుతాయి. కేరళలో ఈ వర్గాలలో సుమారు 45,000 కార్డులు, 66,000 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ఆరు నెలలకు పైగా రేషన్ అందలేదు. లక్షలాది నీలం, గోధుమ,



తెలుపు కార్డులుదారులు కూడా ఆరు నెలల నుంచి రేషన్ తీసుకోలేదని గుర్తించారు అధికారులు. దీంతో వారి కార్డులను నిలిపివేసే అవకాశం ఉంది.

## చేవెళ్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం.

- **చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య.**

**చేవెళ్ల, సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో రూ 52 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి తో కలిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల మున్సిపల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని వెల్లడించారు. రోడ్లు డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, మాజీ సర్పంచ్ ప్రస్తుత కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి, ఉపసర్పంచ్లు మండల పార్టీ అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## ఏసీబీ వలలో తహసీల్దార్ సృజన్‌కుమార్

- **ఏసీబీ వలలో తహసీల్దార్ సృజన్‌కుమార్**
- **వారసత్వ భూమి మార్పిడికి రూ. 15 వేలు డిమాండ్**
- **బేరసారాల అనంతరం రూ. 14 వేలకు ఒప్పందం**
- **లంచం తీసుకుంటుండగా గోవిందరావుపేట అధికారి పట్టివేత**

**ములుగు సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

పూర్వీకుల వ్యవసాయ భూమి వారసత్వ హక్కు నమోదు విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ. 14 వేల లంచం తీసుకుంటూ గోవిందరావుపేట తహసీల్దార్ నెల్లుట్ల సృజన్‌కుమార్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ వరంగల్ రేంజ్ అధికారులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ట్రాప్ నిర్వహించి నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ ప్రెస్‌నోట్ ప్రకారం.. ఫిర్యాదుదారుడి భార్య లింగాల శ్రీలత పేరుతో ఉన్న పూర్వీకుల వ్యవసాయ భూమికి వారసత్వ హక్కు నమోదు విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు తహసీల్దార్ తొలుత రూ. 15 వేల లంచం డిమాండ్ చేశారు. అనంతరం బేరసారాల ద్వారా రూ. 14 వేలకు తగ్గించారు. ఈ మొత్తాన్ని స్వీకరించి కుడివైపు ట్రౌజర్ జేబులో పెట్టుకున్న సమయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ కుడిచేతి వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షలో పాజిటివ్ ఫలితం వచ్చినట్లు ఏసీబీ తెలిపింది. లంచం స్వీకరించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సృజన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి వరంగల్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించింది. కేసు దర్యాప్తులో ఉందని తెలిపింది.



## మండల స్థాయి సమావేశంను విజయవంతం చేయాలి

- **ఎంపిడిఓ హిమబిందు**

**మొయినాబాద్, సెప్టెంబర్ 18(ప్రజా క్షేత్రం):**

నేడు మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారిని హిమబిందు అన్నారు. ఆమె ఓ ప్రకటనలో తెలుపుతూ... నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు సర్పంచులు ఉపసర్పంచ్లు మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక విలేకరులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## గచ్చిబౌలిలో పక్కకు ఒరిగిన నాలుగంతస్తుల భవనం.

- **గోపన్‌పల్లిలో పక్కకు ఒరిగిన భవనం.. పరుగుతీసిన స్థానికులు**
- **స్థానికుల్లో తీవ్ర భయాందోళన**
- **కూల్చివేత పనులకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు**
- **ముందుజాగ్రత్తగా సమీప ఇళ్లలోని ప్రజల తరలింపు**

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**



హైదరాబాద్, గచ్చిబౌలి పరిధిలోని గోపన్‌పల్లిలో ఓ నాలుగంతస్తుల భవనం ప్రమాదకరంగా పక్కకు ఒరిగింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉండటంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గోపన్‌పల్లిలో కేవలం 50 గజాల స్థలంలోనే ఈ నాలుగంతస్తుల భవనాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం ఈ కట్టడం ఒక్కసారిగా ఒకవైపునకు ఒరిగిపోయింది. సమాచారం అందిన వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భవనం కూలిపోయే ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులు దానిని కూల్చివేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా సమీపంలోని ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనతో గోపన్‌పల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ ఇళ్లపై భవనం కూలితే పెను ప్రమాదం సంభవిస్తుందని చుట్టుపక్కల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గర్భనిరోధక మాత్రలపై ఇక వార్నింగ్ తప్పనిసరి..!!

- **ఎమర్జెన్సీ పిల్'పై కేంద్రం కీలక ప్రతిపాదన.**
- **రెగ్యులర్‌గా వాడొద్దంటూ స్పష్టమైన హెచ్చరిక..!!**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**



గర్భనిరోధక మాత్రల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రెగ్నెన్సీ కంట్రోల్ పిల్ 'లెవోనార్జెస్ట్రెల్' 0.75 ఎంజీ/1.5 ఎంజీ ప్యాక్‌పై తప్పనిసరిగా వార్నింగ్ లేబుల్ ముద్రించాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది.

ఇందులో భాగంగా కేంద్రం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఈ మాత్రను వినియోగించాలని, రెగ్యులర్‌గా ఉపయోగించకూడదని ప్యాక్‌పై స్పష్టంగా ముద్రించాలని ప్రతిపాదనలో పేర్కొంది.

అలాగే ఈ మాత్ర అబార్షన్ మాత్ర కాదనే విషయాన్ని వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించింది. మాత్ర వినియోగంతో సంభవించే సైడ్ ఎఫెక్ట్స్, అవసరమైన జాగ్రత్తలు కూడా ప్యాక్‌పై పేర్కొనాలని కేంద్రం ప్రతిపాదించింది.

**అత్యవసర వినియోగమే..**
**రెగ్యులర్ వాడకం వద్దు.!!**

అబార్షన్ పిల్ కాదు.. సైడ్ ఎఫెక్ట్స్‌పై అవగాహన తప్పనిసరి! వినియోగదారులు గర్భనిరోధక మాత్రల విషయంలో సరైన అవగాహనతో వ్యవహరించేలా ప్యాకేజింగ్‌పైనే కీలక హెచ్చరికలను అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రతిపాదన ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

## షాబాద్ మండల కేంద్రంలో భారీ వర్షం!

**షాబాద్ సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండల కేంద్రంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో కురిసిన ఈ వర్షం రైతులకు కొంతమేర ఊరటనిచ్చింది. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం పంటలకు కొంత ప్రయోజనం చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## ఎమ్మార్పీఎస్ నాయకులకులపై దాడి సరికాదు.!

- **కొడిగంటి మల్లికార్జున్ మాదిగ.**

**యాలాల్ సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

శుక్రవారం రాత్రి సుమారు 7:30 గంటల నిమిషాల సమయంలో యాలాల్ మండలం గంగాసరం గ్రామంలో మాదిగలపై బీసీ మరియు ఇతర కులాల వారు, మాదిగలను కులం పేరుతో దూషించి విచక్షణ రహితంగా దాడి చేశారు. చాలా మందికి తీవ్రమైన గాయాలు అయ్యాయి ఇట్టి విషయం ఎస్ఐ తో మాట్లాడి యాలాల్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి కంప్లైంట్ ఇప్పించడం జరిగింది. ఈ మధ్యకాలంలో జిల్లా వ్యాప్తంగా మాదిగలపై విపరీతంగా దాడులు పెరిగాయి.ఈ దాడి పై ఎమ్మార్పీఎస్ పక్షాన పోరాటం చేయాల్సిన అవసరం ఉంది అని కొడిగంటి మల్లికార్జున్ మాదిగ అన్నారు. శనివారం ఉదయం 10:00 గంటలకు యాలాల్ మండలనికి రావలసిందిగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులకు ఆయన కోరారు.



19.09.2026
శనివారం | హైదరాబాద్
ప్రజాక్షేత్రం
ప్రతి క్షణం.. ప్రజల పక్షం

# 'కాకా' రాక పక్కా

"మన టార్గెట్ పండగ రా. అప్పటిదాకా ఎవరికీ సెలవుల్లేవు" అంటూ 'కాకా' టైటిల్ గ్లింప్స్‌తోనే ఈ చిత్ర విడుదలపై స్పష్టత ఇచ్చేశారు కథానాయకుడు చిరంజీవి. సంక్రాంతి బరిలో సందడి చేస్తున్నట్లు తెలియజేస్తూ.. జనవరి 13న వస్తున్నామని విడుదల తేదీని కూడా చెప్పేశారు. అయితే ఇది వాయిదా పడనున్నట్లు గత కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆ ఊహాగానాలకు తెరదించుతూ చిత్ర బృందం విడుదల తేదీపై మరోసారి స్పష్టత ఇచ్చింది. ఈ సినిమా సంక్రాంతికే వస్తుందని.. విడుదల తేదీలో ఏ మార్పు లేదని తెలియజేసింది. అంతేకాదు తొలి పాటను త్వరలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇక మరోవైపు ఈ సినిమాలో చిరు సరసన స్నేహ నటించనున్నట్లు సమాచారం అందుతోంది. తండ్రీ కూతుళ్ల అనుబంధాలతో ముడిపడిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో చిరు రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించనున్నారు. ఆయన కుమార్తె పాత్రలో అనస్వర రాజన్ నటిస్తోంది. నివేదా పేతురాజ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రానికి బాబీ దర్శకత్వం వహిస్తుండగా.. వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు.



# మళ్లీ వచ్చినప్పుడు నన్ను జడల్ అనే పిలుస్తారు

"థియేటర్లో ప్రేక్షకులకు మంచి మాస్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇచ్చే సినిమా 'ది ప్యారడైజ్" అన్నారు కథానాయకుడు నాని. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించారు. సుధాకర్ చెరుకూరి నిర్మించారు. మోహన్‌బాబు కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం చెన్నైలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. "మేము ఓ మంచి కథని బలమైన భావోద్వేగాలతో.. అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చాం. నా కెరీర్‌లో నేను చాలా కష్టపడి చేసిన చిత్రమిది. దీనిపై మేము చాలా నమ్మకంగా ఉన్నాం. కచ్చితంగా ఈ సినిమా అందర్నీ అలరిస్తుంది. ఇది థియేటర్లో ఓ క్రేజీ రైడ్‌లా ఉంటుంది. ఇప్పుడు నన్ను అంతా నాని అని పిలుస్తున్నారు. కానీ, ఈసారి మళ్లీ ఇక్కడికి వచ్చినప్పుడు జడల్ అనే పేరుతో పిలుస్తారు. నిజంగా జడలతో షూటింగ్ చేయడం చాలా కష్టం. కానీ, మహిళలు జీవితాంతం ఆ జడలతోనే ఉంటారు. నిజంగా వారికి హ్యాట్సాఫ్. కయాదు ఈ చిత్రంలో సుబ్బు పాత్రలో నటించింది. ఆ పాత్రకు తను వందశాతం న్యాయం చేసింది" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ ఓదెల, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.




# బత్తా దేనికి భయపడడు

'వరల్డ్ ఆఫ్ బత్తా' పేరుతో 'బత్తా' సినిమా ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసింది చిత్రబృందం. హీరో విజయ్ సేతుపతి, లిజోమోల్ జోస్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రమిది. బాలాజీ తరణీతరణ్ దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు అట్లీ సమర్పణలో మురద్ ఖేతాని, ప్రియా అట్లీ, అలోక్ జైన్, అజిత్ అంధారే రూపొందిస్తున్నారు. అక్టోబరు 1న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇటీవలే టీజర్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. 'అందరూ అతనికి భయపడుతున్నారు కానీ, అతను మాత్రం దేనికి భయపడడు', 'మీరు నాకోసం వెతకొద్దు.. నన్ను నేను చూసుకుంటాను' లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ టీజర్‌లో.. మాస్ అవతారంలో భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపిస్తూ విజయ్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించారు. గ్రామీణ కుటుంబ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది.



# కోలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్న కేతిక శర్మ..



టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో ప్రేక్షకులను పలకరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయిన అందాల భామ కేతిక శర్మ. 'రొమాంటిక్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత 'లక్ష్య', 'రంగరంగ వైభవంగా', 'బ్రో' వంటి పలు సినిమాల్లో నటించి గ్లామర్‌తో మెప్పించారు. అయితే బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆమెకు సరైన హిట్ దక్కలేదు. దీంతో టాలీవుడ్‌లో కొద్దిగా విరామం తీసుకున్న ఈ సుందరి, ఇప్పుడు తన అదృష్టాన్ని కోలీవుడ్‌లో పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'మీసయ్య మురుక్కు 2' సినిమాతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. టాలెంటెడ్ ఆర్టిస్ట్ ఆది నటిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కేతిక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. గతంలో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ సినిమాకు ఇది సీక్వెల్‌గా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతుండగా, కేతిక తాజాగా మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

తమిళంలో తనకు ఇదే మొదటి సినిమా అని చెబుతూ కేతిక తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు తమిళం కొంతవరకు అర్థమైనా, మాట్లాడటం మాత్రం పూర్తిగా రాదని తెలిపారు. అయితే ఆ భాషపై పట్టు సాధించేందుకు తాను ఏకంగా నెల రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాను తమిళ తరగతులకు హాజరవుతున్నానని, ఈ లెర్నింగ్ ప్రాసెస్ తనకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తోందని చెప్పారు. తమిళనాడు ప్రజల ఆదరణ గురించి మాట్లాడుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. అక్కడి ప్రజలంటే తనకు చాలా ఇష్టమని, తాను చెన్నైకి వెళ్లిన ప్రతీసారి అక్కడి ప్రేక్షకులు, కోలీవుడ్ నటీనటులు తనకు ఇచ్చిన స్వాగతం మరువలేనిదని తెలిపారు. అక్కడ తనకు కేవలం అపారమైన ప్రేమ, ఆప్యాయత మాత్రమే దొరికాయని, అందుకు తాను ఎంతో కృతజ్ఞురాలినని చెప్పారు. తమిళ పరిశ్రమతో తన మనసు పూర్తిగా మమేకమైపోయిందని, ఇక్కడి వాతావరణం చూస్తుంటే తన సొంత ఇంట్లో ఉన్నట్లే ఉంటుందని కేతిక చెప్పుకొచ్చారు.

# దేవిలా కొలవడం.. గ్లామర్ పేరుతో వాడుకోవడం..

బాలీవుడ్ స్టార్ బ్యూటీ రాధికా ఆప్టే, శకున్ బాత్రా ఓ ఇంటర్వ్యూలో భాగంగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్ చిత్రాలలో రొమాన్స్‌ను ప్రదర్శించే తీరుపై రాధికా ఆప్టే తన అభిప్రాయాలను పంచుకుంటూ.. తాను షారుఖ్ ఖాన్ సినిమాలకు వీరాభిమానినని చెబుతూనే.. చిన్నతనంలో తాను ఎంతో ఆస్వాదించిన ఆయన పాత చిత్రాలను ఇప్పుడు తిరిగి చూసినప్పుడు కొన్ని దృశ్యాలు తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేశాయని తెలిపారు. ఒకప్పుడు తెరపై ఎంతో శృంగారభరితంగా, గొప్ప ప్రేమగా చూపించిన అనేక సీన్లు నిజానికి ఎంత అభ్యంతరకరంగా ఉన్నాయో ఆమె వివరించారు. ముఖ్యంగా ఒక మహిళ వద్దు అని స్పష్టంగా చెప్పినప్పటికీ, ఆమె అభ్యంతరాన్ని పట్టించుకోకుండా బలవంతంగా వెంటపడటాన్ని ప్రేమగా చూపించడాన్ని ఆమె విమర్శించారు. టీనేజ్ వయసులో ఇలాంటి వాటినే గొప్ప కలలుగా కనేవాళ్లమని, కానీ ఇప్పుడు ఆలోచిస్తే అది ఎంత భయానకంగా అనిపిస్తుందోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఇదే విషయమై దర్శకుడు శకున్ బాత్రా స్పందిస్తూ.. పాతకాలపు హిందీ సినిమాలలో మానసిక కోరికలను తెరకెక్కించిన విధానం గురించి ప్రస్తావించారు. ఆ కథలన్నీ కేవలం పురుషుల కోణం నుంచే నడిచాయని చెప్పారు. శకున్ అభిప్రాయంతో పూర్తి ఏకీభవించిన రాధికా ఆప్టే.. అప్పట్లో తెరపై మహిళలను చిత్రించిన విధానంలోనే అసలైన లోపం ఉందని అన్నారు. ఒకవైపు మహిళలను కేవలం గ్లామర్ కోణంలో వాడుకుంటూనే.. మరోవైపు వారిని మంచి చెడుల పరిధిలో బంధించడం సరికాదన్నారు. ఒకవైపు వారిపై జోకులు వేస్తూ, మరోవైపు వారిని 'దేవి'లా కొలుస్తూ పీఠంపై కూర్చోబెట్టడం తనకు అస్సలు నచ్చలేదని రాధిక ఆప్టే స్పష్టం చేశారు.



# యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ నుంచి కథానాయకుడిగా..



యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ చేసుకునే స్థాయి నుంచి తనను కథానాయకుడిగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు నటుడు సుహాస్ (Suhas) కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఆయన నటించిన 'మండాడి' (Mandaadi) చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అభిమానులనుద్దేశించి సుహాస్ భావోద్వేగంతో కూడిన లేఖను పోస్ట్ చేశారు.

"యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ చేసే రోజుల నుంచి.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, ఆపై హీరోగా ఎదిగే వరకు మీరు నాకు అండగా నిలిచారు. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం మీ ప్రేమ, ప్రోత్సాహం, నాపై మీకున్న నమ్మకమే. మీరిచ్చిన గుర్తింపే నాకు ఎన్నో అవకాశాలకు తలుపులు తెరిచింది. అందులో భాగమే 'మండాడి' కూడా. నా పనితనాన్ని బట్టి మీరు నన్ను ఆదరించారు.

కెరీర్ ప్రారంభంలో నాకు అండగా నిలిచి, నన్ను ఈ స్థాయికి చేర్చిన వారిని నేను ఎప్పటికీ మర్చిపోను. మీ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా నా నటనతో మరింత కష్టపడి పనిచేస్తాను. 'మండాడి' సినిమాను, అందులో నా పాత్రను ఇంతగా ఆదరిస్తున్న అన్ని రాష్ట్రాల ప్రేక్షకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని సుహాస్ తన లేఖలో పేర్కొన్నారు.

సుహాస్, సూరి కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'మండాడి'.

స్పోర్ట్స్‌యాక్షన్ డ్రామాగా దర్శకుడు మతిమారన్ పుగళేంది (mandadi director) దీనిని తీర్చిదిద్దారు. తమిళ, తెలుగు భాషల్లో విడుదలైన ఈ మూవీ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌ను సొంతం చేసుకుంది.

# 'వెట్టువం' కోసం నా సర్వస్వాన్ని ధారపోశా..

*అందాల భామ శోభిత ధూళిపాళ సెకండ్ ఇన్నింగ్స్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. వివాహం తర్వాత 'చీకటి'లో అనే క్రైమ్ థ్రిల్లర్‌తో ప్రశంసలు అందుకున్న ఆమె ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ పా. రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'వెట్టువం'లో శోభిత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆర్య, శోభిత ధూళిపాళతో పాటు దినేష్ ప్రధాన పాత్రలలో కనిపించనున్నారు. ఈ సినిమాకు జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు చాలా ఘనంగా జరిగాయి. షూటింగ్‌ను కూడా ప్రారంభించిన మేకర్స్, ఒక స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇక ఈ ఈవెంట్‌లో పాల్గొన్న శోభిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పా. రంజిత్ సినిమాల్లోని స్త్రీలు ఎప్పుడూ ఇతరుల రక్షణ కోసం ఎదురుచూడరని, తమ సొంత హృదయం చెప్పిన మార్గంలో స్వతంత్రంగా నడుస్తారని ప్రశంసించారు. 'వెట్టువం'లో తాను పోషిస్తున్న పాత్ర గురించి చెబుతూ.. ఈ సినిమాలో తన పాత్ర ఎన్నో పోరాటాలతో సాగుతుందని, పూర్తిగా తన సొంత నిర్ణయాల ద్వారానే ముందుకు వెళ్తుందని తెలిపారు.*

*తాను ఎంచుకునే పాత్రలకు భావోద్వేగాల పరంగా పూర్తిగా కనెక్ట్ అవుతానని, 'వెట్టువం'లో నటించేటప్పుడు తన సర్వస్వాన్ని ధారపోశానని శోభిత చెప్పారు. ఇలాంటి ప్రాజెక్ట్‌లో భాగం కావడమే ప్రతి నటి నిజమైన కల అని అన్నారు. సాధారణంగా సినిమాలలో ఫైటింగ్ సీన్లన్నీ హీరోలకే దక్కుతాయని, హీరోయిన్లకు మాత్రం కేవలం ఎమోషనల్ సీన్లు మాత్రమే వస్తుంటాయని తెలిపారు. కానీ ఈ చిత్రంలో మాత్రం ఆ ట్రెండ్ మారుతుందని, ఈ సినిమాలో వచ్చే సగం పోరాట సన్నివేశాల్లో తానే స్వయంగా నటిస్తున్నానని వెల్లడించారు. 'వెట్టువం'లో తనకు డాన్స్ చేయడానికి, ఫైట్స్ చేయడానికి, చక్కటి అభినయం ప్రదర్శించడానికి చాన్స్ దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన సినిమాను తెరపై ఎప్పుడెప్పుడు చూస్తానా అని తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.*



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394